


Truth of News
PRGI Reg No: APTEL/26/A4781

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 02 | సంచిక : 07 | శనివారం 15 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## ఉత్తరాఖండ్‌లో ఘోరం

- సొరంగ ప్రమాదంలో ఏడుగురు మృతి
- చమోలీలోని హెచ్‌సీసీ జలవిద్యుత్ ప్రాజెక్టు వద్ద ఘటన
- సహాయక చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఆర్మీ సిబ్బంది



**చమోలి – సూర్య వాస్తవం**

ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. పీపల్‌కోటి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగంలోకి ఒక్కసారిగా భారీగా నీరు, బురద రావడంతో అందులో కార్మికులు చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు మరణించినట్లు అధికారులు తెలి పారు. సొరంగంలోకి చిక్కుకున్న కార్మికుల్లో 19 మందిని బయటకు తీసి గోపేశ్వర్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆ 19 మందిలో ఏడుగురు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. మిగతా వారికి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. మరొక యువకుడిని మెరుగైన చికిత్స కోసం శ్రీనగర్‌లోని బేస్ ఆస్పత్రికి రిఫర్ చేశామని గోపేశ్వర్‌లోని జిల్లా ఆస్పత్రి డాక్టర్ ఆయుష్ తెలిపారు. ఇదిలా ఉండగా, సొరంగంలో చిక్కుకున్న మిగతా కార్మికులను సురక్షితంగా బయటకు

- మిగతా 2లో..



## నాకు తెలియకుండా ఇంత పెద్ద నిర్ణయమా?

- అధికారులపై డీకే శివకుమార్ ఫైర్..
- గుట్కా నిషేధ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కర్ణాటక ప్రభుత్వం యోచన
- వక్క రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయని ఎమ్మెల్యేల నుంచి తీవ్ర వ్యతిరేకత
- తనకు తెలియకుండా ఉత్తర్వులు జారీ చేయడంపై అధికారులపై ఆగ్రహం
- ప్రజారోగ్యం, రైతుల ప్రయోజనాలు రెండింటినీ కాపాడాలని మాజీ సీఎం బొమ్మై హితవు
- ప్రభుత్వ నిర్ణయంతో గుట్కా కొనుగోలుకు ఎగబడుతున్న వినియోగదారులు

2లో

## రాజ్యాంగాన్ని గౌరవించాలి

- అంబేద్కర్ ఆశయాలు గుర్తుంచుకోవాలి
- మూడు రంగుల జెండా స్వాతంత్ర్యానికి ప్రతీక
- భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని జాతిని ఉద్దేశించి ప్రసంగం



**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పునస్కరించుకొని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి ప్రసంగించారు. ప్రజలు భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను గుర్తుంచుకోవాలని అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంగా అందరూ పని చేయాలని సూచించారు. అభివృద్ధి ఫలాలు దేశంలోని ప్రతి ఒక్కరికీ అందాలని ఆమె ఆకాంక్షించారు. అలాగే దేశ న్యాయ వ్యవస్థను, చట్టసభలను గౌరవించాలని ప్రజలకు సందేశ మిచ్చారు. తాజాగా లోక్‌సభలో మొట్ట మొదటి సారిగా ఆలపించిన వందేమాతరం గేయాన్ని పౌరులంతా

- మిగతా 2లో..

## రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట

**- సావర్కర్‌పై వ్యాఖ్యల కేసు కొట్టివేత**

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**



పరువునష్టం కేసులో లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వినాయక్ దామోదర్ సావర్కర్‌పై గతంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి దాఖలైన క్రిమినల్ పరువునష్టం కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో అంతకుముందు లక్నో కోర్టు జారీ చేసిన సమన్లను కూడా కోర్టు రద్దు చేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షిల్ నాగుతో కూడిన ధర్మాసనం తాజా

- మిగతా 2లో..

## ఎర్రకోట చుట్టూ ట్రాఫిక్ ఆంక్షలు



**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

నేడు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఢిల్లీ పోలీసులు వాహనాదారులకు కీలక సూచనలు చేశారు. ఎర్రకోట పరిసర ప్రాంతాల్లో పలు మార్గాల్లో తాత్కాలికంగా రాకపోకలు నిలిపి వేయబడతాయని తెలియజేశారు. ఉదయం 4 గంటల నుంచి10 గంటలకు వరకు ఆయా మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలో ఉంటాయని వెల్లడించారు. ముందస్తు అనుమతి ఉన్న వాహనాలకు మాత్రమే రాకపోకలకు షర్మిట్ ఉంటుందని పోలీసులు తెలియజేశారు. ఢిల్లీ గేట్ టూ ఛత్తా రైల్ చౌక్ మధ్య నేతాజీ సుభాష్ మార్గ్, జిపిఓ ఢిల్లీ, ఛత్తా రైల్ చౌక్ మధ్య లోథియన్ రోడ్, హెచ్‌సి సేన్ మార్గ్, యమునా బజార్ చౌక్ మధ్య ఎస్.పి. ముఖర్జీ మార్గ్, ఫౌంటెన్ చౌక్ -- రెడ్ ఫోర్ట్ మధ్య చాందినీ చౌక్ రోడ్, రింగ్ రోడ్ -- నేతాజీ సుభాష్ మార్గ్ మధ్య నిషాద్ రాజ్ మార్గ్, నేతాజీ సుభాష్ మార్గ్ వైపు వెళ్లే ఎస్ప్లనేడ్ రోడ్ , లింక్ రోడ్, రాజ్‌ఘాట్- ఐఎస్‌బిటి కాశ్మీర్ గేట్ మధ్య రింగ్ రహదారులో ట్రాఫిక్ ఆంక్షలు వర్తిస్తా యని ప్రకటించారు.

- మిగతా 2లో..

## డేటా సెంటర్లకు నీటి సరఫరాపై దుష్ప్రచారం మాత్రమే

- సీఎం చంద్రబాబు
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని చంద్రబాబు ఆదేశం
- లోటు వర్షపాతం దృష్ట్యా నీటిని పొదుపుగా వాడాలని అధికారులకు స్పష్టం
- పోలవరం, వెలిగొండ సహా 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని సూచన
- అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టుకు నీరిచ్చే అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశం



**అమరావతి– సూర్య వాస్తవం**

రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్లకు భారీగా నీటిని కేటాయిస్తున్నా రంటూ జరుగుతున్న ప్రచారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. అది కేవలం దుష్ప్రచారమేనని, డేటా సెంటర్ల పూర్తిస్థాయి అవసరాలకు కేవలం 3.5 టీఎంసీల నీరు మాత్రమే సరిపోతుందని స్పష్టం చేశారు. ఈ వాస్తవాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అపోహలను తొలగించాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న లోటు వర్షపాతం పరిస్థితుల దృష్ట్యా, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకే ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. నేడు సచివాలయంలో జలవనరుల శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. వాటర్ మూవ్‌మెంట్ ప్లాన్‌కు అనుగుణంగానే నీటి నిర్వహణ చేపట్టాలని, రిజర్వాయర్లు, చెరువుల్లోని నీటి నిల్వలతో పాటు భూగర్భ జలాలను అత్యంత సమర్థంగా వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని

## గ్లోబల్ సమ్మిట్ 2.0



**హైదరాబాద్– సూర్య వాస్తవం**

గతేడాది తరహాలోనే ఈ ఏడాది కూడా డిసెంబర్ ఏడు, ఎనిమిది, తొమ్మిది తేదీల్లో ఫ్యూచర్‌సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ సమ్మిట్ నిర్వహణ కోసం ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి,

- మిగతా 2లో..

- డిసెంబర్ 7,8,9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో.. ఉప ముఖ్యమంత్రి భట్టి నేతృత్వంలో ఉపసంఘం..
- హిల్ట్ పాలసీ దరఖాస్తు గడువు పొడిగింపు
- ప్రభుత్వ, వివాదాల్లేని భూ సమస్యలు పరిష్కరిస్తాం..
- క్యూర్ పరిధిలో ఎలక్ట్రిక్ వాహనాలుగా ఆటోలు
- 7 రకాల సన్నాలకే బోనస్..స్కిల్స్ వర్సిటీ పరిధిలోకి ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్‌లు..
- 7 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ గురుకులాలు మంజూరు..
- నేడు సంగారెడ్డిలో ఘనంగా స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ
- మంత్రివర్గం నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



## ఎందరో త్యాగధనుల ప్రతిఫలం.. స్వాతంత్ర్యం

**- దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయులకు ఘన నివాళి**

ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాలు, వీరుల రక్తతర్పణాల ఫలితమే మనకు లభించిన స్వాతంత్ర్యం. బ్రిటిష్ పాలన నుంచి భారతదేశానికి విముక్తి కల్పించేందుకు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు, వీరవనితలు అహర్నిశలు పోరాడారు. దేశం కోసం తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించి, భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించి పెట్టారు.వారి త్యాగాల ఫలితంగానే నేడు ప్రతి భారతీయుడు గర్వంగా "ఇది నా భారతదేశం" అని తలెత్తుకుని చెప్పుకోగలుగుతున్నాడు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన ప్రతి సమరయోధుడికి, ప్రతి వీరవనితకు యావత్ భారతజాతి తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు.

అదేవిధంగా తెలుగు నేల నుంచి స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని, దేశం కోసం పోరాడిన ఎందరో మహనీయులు, సమరయోధులు, వీరవనితల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత. వారి ధైర్యం, దేశభక్తి, త్యాగస్ఫూర్తి నేటి తరానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకం. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ఎప్పటికీ మరువకుండా, దేశ ఐక్యత, సమగ్రత, సౌభ్రాతృత్వం, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తిద్దాం. దేశ ప్రగతిలో భాగస్వాములమై, భావితరాలకు మరింత బలమైన, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని అందించేందుకు కృషి చేద్దాం.

భారతదేశ ప్రజలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు అనంతపురం జిల్లా ప్రజలకు అధికారులు ప్రజాప్రతి నిధులు, నాయకులు, జర్నలిస్టులు, ప్రతి ఒక్కరికీ 'సూర్య వాస్తవం' తరఫున 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభా కాంక్షలు.

– ఎస్. ఆరిఫ్ అలీ,
సూర్య వాస్తవం దినపత్రిక చైర్మన్

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# రాజ్యాంగాన్ని గౌరవించాలి

(మొదటిపేజీ తరువాయి)

గౌరవించాలని ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము కోరారు. మరికొన్ని గంటల్లో మనం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వైభవంగా జరుగనున్నాయనీ, దేశ ప్రజలతో పాటు విదేశాల్లోని భారతీయులు సైతం జెండా పండుగలో సగర్వంగా పాల్గొననున్నారని తెలిపారు. "మూడు రంగుల జెండా స్వాతంత్ర్యానికి ప్రతీక. ఈ పతాకాన్ని మనం ఎంతో గౌరవంతో ఎగురవేస్తాం. 1947, ఆగస్టు15వ తేదీన బ్రిటీష్‌వారి కబంద హస్తాల నుంచి మన నేలకు స్వేచ్ఛ లభించింది.

మనదేశంలోని విద్యార్థులు, టీచర్లు, శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు అభివృద్ధి కోసం ఆతృతగా ఉన్నారు. అలానే వైద్యులు, వైద్యరంగంలోని సిబ్బంది ఆరోగ్య రంగంలో కృషి చేస్తున్నారు. రైతులు పంటలు పండించడం ద్వారా దేశ నిర్మాణంలో భాగమవుతున్నారు. మిగతా రంగాల్లోని వారు సైతం రాజ్యాంగంలోని ప్రాథమిక విధులను నిర్వర్తిస్తున్నారు. వారందరిని నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా" అని ముర్ము తెలిపారు. జాతిపిత మహాత్మా గాంధీ నాయకత్వంలో ఎందరో పౌరులు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. "సామాజిక సంస్కరణలు, దేశం పట్ల ప్రేమకు సంబంధించిన విలువైన, ఆచరణీయమైన విషయాలను బాబాసాహెబ్ అంబేద్కర్ మనకు అందించారు. ఈరోజు ఆగస్టు 14. ఈ రోజును విభజన భయానక దృశ్యాలను గుర్తుచేసుకునే రోజు. విభజన సమయంలో చెలరేగిన మతపరమైన హింస కారణంగా లక్షలాది మంది బలవంతంగా శరణార్థులుగా మారారు. అయినా సరే ఇప్పటికీ వారు తమ గుర్తింపును మాత్రం వదులుకోలేదు" అని ఆమె తెలిపారు.

**ఫూలే, సావిత్రిబాయి దంపతుల కృషి చారిత్రాత్మకం**

ప్రజల ఆశయాలు చట్టసభల్లో తెలియజేయడం ప్రజాప్రతినిధుల బాధ్యతనీ, పౌరులు, దేశ ప్రయో జనాలను దృష్టిలో పెట్టుకొని విధానాలు రూపొందించాల్సిన బాధ్యత చట్టాలను అమలు చేసేవాళ్లపై ఉందని అన్నారు. ఏ ఒక్కరు కూడా న్యాయానికి దూరమవ్వకుండా చూడాల్సిన బాధ్యత న్యాయ వ్యవ స్థలోని ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. మహాత్మా జ్యోతిబా ఫూలే 200వ జయంతిని నిర్వ హించుకున్నామని గుర్తు చేసిన రాష్ట్రపతి... విద్య, సమానత్వం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత వంటి అంశాల్లో ఫూలే, సావిత్రిబాయి ఫూలే దంపతులు చారిత్రాత్మకమైన కృషి చేశారని కొనియాడారు. వారి స్ఫూర్తితోనే అణగారిన వర్గాల అభివృద్ధికి ఈమధ్య ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.

# రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణకు అవసరమైన అనుమతిని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం నుంచి పొందలేదని, అందువల్ల ఇది విచారణార్హం కాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దీంతో రాహుల్‌పై నమోదైన క్రిమినల్ పరువునష్టం కేసును కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై తమ అనుమతి తీసుకున్నట్టు ఎలాంటి ఆధారాలు తమ వద్ద లేదని చెబుతూ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. భారత్ జోడో యాత్ర సందర్భంగా 2022, నవంబర్ 17న మహారాష్ట్రలోని అకోలాలో పర్యటిస్తుండగా రాహుల్ గాంధీ.. సావర్కర్‌పై కొన్ని వ్యాఖ్యలు చేశారు. అయితే, రాహుల్ ఉద్దేశపూర్వకంగా సావర్కర్ గౌరవాన్ని తగ్గించే లక్ష్యంతోనే ఈ వ్యాఖ్యలు చేశారని, ఆయన పరువుకు భంగం కలిగించారని ఆరోపిస్తూ నృపేంద్ర పాండే అనే లాయర్.. రాహుల్‌పై ఫిర్యాదు చేశాడు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన లక్నో కోర్టు దీనిపై విచారణ జరిపి, రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో తనపై నమోదైన కేసును కొట్టేయాలని కోరారు.స్పందించిన సుప్రీంకోర్టు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. దీనికి యూపీ ప్రభుత్వం బదులిస్తూ ఒక అఫిడవిట్ సమర్పించింది. ఈ కేసులో రాహుల్ గాంధీపై 153 ఏ సెక్షన్ ప్రకారం కేసు నమోదైందని, దీనిపై విచారణ జరిపేందుకు అవసరమైన అనుమతుల్ని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం నుంచి తీసుకోలేదని సుప్రీంకోర్టు గుర్తించింది. యూపీ ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌లో కూడా ఈ వివరణ ఉంది. దీంతో రాహుల్ గాంధీపై నమోదైన పిటిషన్‌పై విచారణకు అర్హత లేదని భావిస్తూ.. సుప్రీంకోర్టు ఈ కేసును కొట్టివేసింది.

# నాకు తెలియకుండా ఇంత పెద్ద నిర్ణయమా?

**బెంగళూరు – సూర్యవాస్తవం**

కర్ణాటకలో గుట్కా నిషేధిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేసిన కొద్ది రోజులకే ప్రభుత్వం వెనక్కి తగ్గేందుకు సిద్ధమైంది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని వక్క (అడక) రైతులు తీవ్రంగా నష్టపోతారని అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. గుట్కా నిషేధ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు ప్రభుత్వ వర్గాలు శుక్రవారం తెలిపాయి. గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై తీవ్ర చర్చ జరిగినట్లు సమాచారం. ఇంతటి కీలకమైన నిర్ణయం తన దృష్టికి రాకుండా ఎలా జారీ చేశారని సీఎం అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఆరోగ్యశాఖ కార్యదర్శిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తర్వులు జారీ చేసే ముందు తనతో ఎందుకు చర్చించలేదని నిలదీశారు. రాష్ట్రంలోని ఏడెనిమిది జిల్లాల్లో రైతులు పూర్తిగా వక్క సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారని ఆయన గుర్తుచేశారు. అంతకుముందు కాంగ్రెస్, బీజేపీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలిసి గుట్కా నిషేధం వల్ల వక్క రైతులకు జరిగే నష్టంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం గురించి తనకు తెలియదని, సమస్యను పరిష్కరిస్తానని సీఎం వారికి హామీ ఇచ్చారు. తమతో సంప్రదించకుండా ఇలాంటి నిర్ణయం తీసుకోవడంపై ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ పరిణామంపై మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ ఎంపీ బసవరాజ్ బొమ్మై స్పందిస్తూ.. ప్రజారోగ్యం, రైతుల ప్రయోజనాల మధ్య ప్రభుత్వం సమతుల్యం పాటించాలని సూచించారు. "ఆరోగ్యం ముఖ్యమే, కానీ వక్క రైతుల ప్రయోజనాలను కూడా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఒకప్పుడు మల్నాడు ప్రాంతానికే పరిమితమైన వక్క సాగు, ఇప్పుడు రాష్ట్రంలోని చాలా జిల్లాలకు విస్తరించింది. రైతులు ఐదేళ్ల పాటు పెట్టుబడి పెట్టి పంట కోసం ఎదురుచూస్తారు. ఇలాంటి ఏకపక్ష నిర్ణయాలు వారిని తీవ్రంగా దెబ్బతీస్తాయి. ఒకవేళ నిషేధం అమలు చేయాలనుకుంటే రైతులకు నష్టపరిహారం అందించాలి" అని ఆయన డిమాండ్ చేశారు. వక్క రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తే, ముఖ్యంగా మల్నాడు ప్రాంతంలో తీవ్ర ప్రతిఘటన ఎదురవుతుందని జేడీఎస్ ఎమ్మెల్యే ఎ. మంజు హెచ్చరించారు. "రైతుల ఆందోళనలకు మేం మద్దతిస్తాం. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి" అని ఆయన కోరారు. మరోవైపు, గుట్కా నిషేధం వార్తలతో వినియోగదారులు ఆందోళనకు గురై, పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు. కొందరైతే బస్తాల్లో గుట్కా ప్యాకెట్లను తీసుకెళు తున్న దృశ్యాలు కనిపించాయి. ఈ వివాదం నేపథ్యంలో, ఉన్నతస్థాయి సమావేశం అనంతరం ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# ఉత్తరాఖండ్‌లో ఘోరం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకువచ్చేందుకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల ఆధ్వర్యంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. రెస్క్యూ బృందం సంఘటనా స్థలానికి చేరుకున్నప్పుడు సొరంగంలో భారీ ప్రవాహంలో నీరు చేరిందని, పక్కల నుంచి కూడా నీరు లీకవుతోందని ఎన్డీఆర్ఎఫ్ టీమ్ కమాండర్ అమృత్‌లాల్ మీనా తెలిపారు.

**ఏం జరిగింది..?**

ఈ ప్రమాదం జరిగిన సమయంలో సొరంగం లోపల దాదాపు 22 మంది కార్మికులు ఉన్నారని టీహెచ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) కుమార్ శరద్ తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్ కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను మోహరించామన్నారు. పీపల్‌కోటి పరిధిలోని మాయాపూర్ వద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగం (విష్ణుగడ్–పిపల్‌కోటి హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్ట్) నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

హిందుస్తాన్ కన్ స్ట్రక్షన్ కంపెనీ ఈ నిర్మాణ బాధ్యతలను నిర్వహిస్తోంది. గురువారం సాయంత్రం సుమారు 7 గంటల మధ్య సొరంగంలో తవ్వకాలు జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దం వచ్చింది. క్షణాల వ్యవధిలో భారీ ప్రవాహంతో నీరు, పెద్దఎత్తున బురద, శిథిలాలు సొరంగంలోకి దూసుకొచ్చాయి. దీంతో అందులో పనిచేస్తున్న కార్మికులు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. నీటి ఉధృతి, బురద ఎక్కువగా ఉండి ఇరుక్కుపోవడంతో వారంతా లోపల చిక్కుకుపోయారు. ఈ దుర్ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డెహ్రాడూన్‌లోని రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ కార్యాలయం నుంచి ఆయన ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

**చమోలీలో పదే పదే విపత్తులు**

పర్వత ప్రాంతాలతో కూడిన చమోలీ జిల్లా ప్రకృతి పరంగా అత్యంత సమస్యాత్మక ప్రాంతంగా మారుతోంది. గతంలో సంభవించిన జోషిమఠ్ భూ కుంగుబాటు, రైనీ గ్రామం వద్ద పెను విపత్తులు ప్రజలను ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి.

తాజాగా కురుస్తున్న వర్షాలు, కొండచరియలు విరిగిపడటం వంటి పరిణామాలు సహాయక చర్యలకు తీవ్ర సవాళ్లు విసురుతున్నాయి. అయినప్పటికీ అధికారుల సమన్వయంతో రెస్క్యూ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నారు.

# డేటా సెంటర్లకు నీటి సరఫరాపై దుష్ప్రచారం మాత్రమే

(మొదటిపేజీ తరువాయి)

సీఎం సూచించారు. ఈ సందర్భంగా పోలవరం, వెలిగొండ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. పోలవరం ప్రాజెక్టులో ఇప్పటివరకు 89.9 శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. ఇటీవల గోదావరికి 14 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కొనసాగించామని తెలిపారు.

దీనిపై స్పందించిన సీఎం, ప్రాజెక్టు సమీపంలోని గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ స్థానికుల మనోభావాలను గౌరవించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి విశాఖపట్నం వరకు ఎడమ కాలువ పనులను పూర్తి చేయాలని గడువు విధించారు. పోలవరం కుడి, ఎడమ కాలువలకు మంచి పేర్లను సూచించాలని కోరారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో ఆరుతడి పంటలు సాగు చేయవద్దని రైతులకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూగర్భ జలాలు పెంచేందుకు 'జలధార–జలహారతి' కార్యక్రమాలను కొనసాగించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రాధాన్యతగా గుర్తించిన 36 ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడంతో పాటు, నిర్వాసితుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా, అన్నమయ్య ప్రాజెక్టు దిగువన ఉన్న ఆయకట్టుకు నీరందించే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్సీ (ఇంజినీర్ ఇన్ చీఫ్), వివిధ ప్రాజెక్టుల సీఈలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గ్లోబల్ సమ్మిట్ 2.0

(మొదటిపేజీ తరువాయి)

వివేక్ వెంకటస్వామి సభ్యులుగా ఉన్నారు. గతేడాది తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించినట్టే ఈసారి ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్‌తో సదస్సు నిర్వహణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధానంగా రాష్ట్రంలో రక్షణ, ఏరోస్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ సదస్సు జరగనుంది. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు, వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. శుక్రవారం ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించారు.

ఇందులో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వివరాలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ రఘురాంరెడ్డితో కలిసి సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. 22ఏ పరిధిలో కొన్ని వాస్తవమైన దరఖాస్తులున్నట్టు తమ దృష్టికి వచ్చిందని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. ప్రభుత్వ, నిషేధిత జాబితాలో లేకుంటే, న్యాయస్థానాల్లో వివాదాల్లేని భూముల దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించామని అన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టే ప్రభుత్వం కాదన్నారు. ఒక్క అంగుళం కూడా నష్టపోకుండా చూస్తామని చెప్పారు. క్యూర్ పరిధిలో ఉండే 46 మంది సబ్ రిజిస్ట్రార్లతో సమీక్ష చేశామనీ, 22ఏకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలిచ్చామని అన్నారు. ఏమైనా సమస్యలుంటే తన నెంబర్‌కు పంపాలనీ, వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**మంత్రివర్గ నిర్ణయాలివే...**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శనివారం రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్రంలో 2.81 కోట్ల మంది రేషన్ కార్డు లబ్ధిదారులుంటే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త రేషన్ కార్డులు జారీ చేసింది. కొత్తగా కుటుంబీకుల పేర్లను కూడా నమోదు చేసింది. 62 లక్షల మందికి కొత్తగా లబ్ధి చేకూర్చింది. రాష్ట్రంలో 3.42 కోట్ల మంది రేషన్ లబ్ధిదారులున్నారు. వారికి స్మార్ట్ కార్డుల జారీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లాల్లోనూ ఇన్‌చార్జీ మంత్రులు పంపిణీ చేస్తారు.

**హిల్ట్ పాలసీ దరఖాస్తు గడువు అక్టోబర్ 31 వరకు పెంపు**

హైదరాబాద్ నగర పరిధిలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను నగర శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన హిల్ట్ పాలసీ దరఖాస్తుల గడువును మరో మూడు నెలలు రాష్ట్ర మంత్రివర్గం పొడిగించింది. దరఖాస్తుదారుల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

**7 రకాల సన్నాలకే రూ.500 బోనస్**

వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, సాగును పెంచడానికి రైతులకు అవగాహన కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుందని వివరించింది. ఈ ఏడాది నుంచి ఆ ఏడు రకాల సన్నాలకే మద్దతుధరతోపాటు రూ.500 బోనస్ చెల్లించాలని తీర్మానించింది.

**మిగులు ధాన్యం ఈ–వేలం**

యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందని మంత్రివర్గం తెలిపింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులకు కనీస మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసిందని పేర్కొంది. అందులో 63.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కేంద్ర ప్రభుత్వం సేకరించింది. మిగతా 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ వేలం ద్వారా విక్రయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇటీవల మొక్కజొన్న వేలంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం రాబట్టుకున్న నేపథ్యంలో ఈ మిగులు ధాన్యానికి కూడా క్వింటాలుకు రూ.2,389 కనీస ధర నిర్ణయించి ఈ వేలం ద్వారా అమ్మాలని నిర్ణయించింది.

**శక్తి శాఖ పరిధిలోకి స్కిల్స్ వర్సిటీ**

రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తేవడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యాశాఖ పరిధిలో ఉన్నాయి. వాటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. ప్రస్తుతం పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న వాటన్నింటినీ ఇకపై శక్తి శాఖ పరిధిలోకి విలీనం చేసేందుకు క్యాబినెట్ తీర్మానించింది.

**ఈవీలుగా 18,766 ఆటోలు**

కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో ప్రస్తుతం 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలున్నాయి. వాటిని ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ)గా మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం (తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్) అమలుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50 లక్షల సబ్సిడీ ఇవ్వనున్నట్టు పేర్కొంది. ప్రస్తుతం ఉన్న ఆటోకు విద్యుత్ కిట్ అమర్చుకోవటం లేదా పాత వాహనాన్ని స్క్రాప్ చేసి కొత్త విద్యుత్ ఆటో కొనుగోలు చేసుకునేందుకు ఈ పథకం ద్వారా అవకాశం కల్పించనున్నట్టు తెలిపింది.

**కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్–2 పనులకు రూ.2,100 కోట్ల అంచనా**

మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం ఫేజ్–2 పనుల కోసం రూ.2,100 కోట్ల అంచనా వ్యయానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరు, ఆ ప్రాంతంలో తాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు ఈ ఎత్తిపోతల నుంచి నీళ్లు అందుతాయని పేర్కొంది. గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీ నుంచి 15 టీఎంసీలకు పెంచటంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ నియామకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

**వచ్చే విద్యాసంవత్సరంలో ఇంటిగ్రేటెడ్ గురుకులాల్లో తరగతులు**

ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాల నిర్మాణానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో తొలివిడతగా 113 నియోజక వర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల కాంప్లెక్స్‌లను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు 86 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల కాంప్లెక్స్‌లకు అనుమతులు మంజూరయ్యా యని తెలిపింది.

మిగిలిన నియోజక వర్గాల్లోనూ వీలైనంత తొందరగా స్థల సేకరణ చేసి, నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ గురుకులాలను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారని పేర్కొంది. నిర్మాణాలు పూర్తయిన చోట వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గ నిర్ణయించింది.

# ఎర్రకోట చుట్టూ ట్రాఫిక్ ఆంక్షలు

(మొదటిపేజీ తరువాయి)

వాహనదారులు తమ ప్రయాణాలను ముందుగానే ప్లాన్ చేసుకోవాలని, ఆంక్షలు ఉన్న రోడ్లకు దూరంగా ఉండాలని, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు సూచించారు.



సూర్య వాస్తవం
Truth of News
http://www.suryavastavam.in



## సంపాదకీయం

# తెలుగు రాష్ట్రాల్లో కనిపించని జెన్ జీ




ఆధునిక రాజకీయాల్లో జెన్ జీ ఓటర్లు అత్యంత కీలకమైన శక్తిగా మారుతున్నారు. జెన్ జీ వీధుల్లోకి వచ్చి ప్రభుత్వాలను గడగడలా డించిన దృశ్యాలను చూసి, తెలుగు రాష్ట్రాల రాజకీయ పార్టీలు కూడా ఈ తరాన్ని తమవైపు తిప్పుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అయితే, గడిచిన కొద్దికాలంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే.. పార్టీలు ఎంతో ఆర్భాటంగా ప్రచారం చేస్తున్న జెన్ జీ కార్డు క్షేత్రస్థాయిలో ఆశించిన ప్రభావం చూపలేకపోతోంది. తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా జెన్ జీ ఆధారిత ప్రచారాన్ని తీవ్రంగా నడిపే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ చదువుల్ని క్రిమినల్ వేస్ట్ అని సంబోధించడంతో యువ ఇంజనీర్లందర్నీ అలా అన్నారని కేటీఆర్ క్యాంపెయిన్ చేశారు. క్రిమినల్ వేస్ట్ , అన్ ఫిట్ వంటి హ్యాష్‌ట్యాగ్‌లు, మీమ్ కల్చర్‌తో యంగ్ ఓటర్లను ఆకట్టుకోవాలని చూశారు. అయితే, ఈ మీమ్స్ సోషల్ మీడియాలో ఎంటర్‌టైన్‌మెంట్‌గా మాత్రమే మిగిలిపోయాయి తప్ప, నిరుద్యోగ యువతను లేదా కాలేజీ విద్యార్థులను రోడ్లపైకి తెచ్చి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాస్ ప్రొటెస్ట్‌గా మార్చడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి మరోలా ఉంది.

వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయిన తర్వాత పార్టీని పునర్నిర్మించే క్రమంలో యువతను ఆకట్టుకునేందుకు వినూత్నంగా ప్రయత్నించింది. అయితే, నిజమైన తటస్థ జెన్ జీ యువతను భాగస్వాములను చేయడం కంటే, ఇప్పటికే పార్టీలో ఉన్న తమ అనుబంధ విద్యార్థి విభాగం, ఐటీ సెల్ కార్యకర్తలకే జెన్ జీ అనే కొత్త ల్యాబెల్ వేసి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించడం కనిపించింది. డీఎస్సీ పోరాటాల్లో ఈ పద్ధతి ఎక్కువగాఉంది. కేవలం పార్టీ ప్రచార పత్రాలు పట్టుకుని ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్‌లలో హల్‌చల్ చేయడం వల్ల అది కేవలం ఆర్గనైజ్డ్ పార్టీ ప్రచారంగానే మిగిలిపోయింది తప్ప, ఏపీలోని సాధారణ యువతలో ఎలాంటి పొలిటికల్ అప్‌రైజింగ్‌ను తీసుకరాలేకపోయింది. తెలుగు యువతలో అత్యధిక శాతం మంది ఐటీ ఉద్యోగాలు, యూఎస్/యూకే ఉన్నత చదువులు, గ్రూప్స్. సివిల్స్ , ఇతర ప్రభుత్వ ఉద్యోగాల సాధనలోనే నిమగ్నమై ఉన్నారు. డిజిటల్ స్పేస్‌లో తమ అభిప్రాయాలను వ్యక్తపరిచినా, రోడ్డెక్కి నిరసన తెలిపితే నమోదయ్యే క్రిమినల్ కేసులు తమ భవిష్యత్తు, వీసా అవకాశాలను దెబ్బతీస్తాయనే హెచ్చరిక వారిని వెనక్కి లాగుతోంది. నేటి తరం రాజకీయ వ్యతిరేకతను లేదా మద్దతును రీల్స్, మీమ్స్, ఎక్స్ , స్పేసెస్, డోపమైన్ ఇచ్చే డిజిటల్ కంటెంట్ రూపంలోనే చూపిస్తోంది. వీధి పోరాటాల కంటే డిజిటల్ ట్రోలింగ్‌నే వారు సౌకర్యవంతమైన యాక్టివిజంగా భావిస్తున్నారు. రాజకీయ పార్టీలు జెన్ జీ మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడంలో పొరబడుతున్నాయి. నాయకులు వేసే మీమ్స్ లేదా వాడే జార్గన్స్ చూసి తమను వారు ప్రతిబింబిస్తున్నారని యువత భావించడం లేదు. పార్టీలు ప్రదర్శించే ప్రచా కృత్రిమమైనదిగా ఉండటంతో యువత సులభంగా గుర్తిస్తోంది. ఉపాధి అవకాశాలు, క్వాలిటీ ఎడ్యుకేషన్, గిగ్ ఎకానమీ కార్మికుల సమస్యలు, స్టార్టప్ ఈకోసిస్టమ్, ప్రాజెక్టుల పురోగతి వంటి నిజమైన ఎజెండా వదిలేసి.. కేవలం వ్యక్తిగత దూషణలు, రాజకీయ ట్రోలింగ్ చుట్టూ తిరిగే కంటెంట్‌ను జెన్ జీ లైట్ తీసుకుంటోంది. రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయనంత మాత్రాన తెలుగు జెన్ జీకి రాజకీయ స్పృహ లేదనుకోవడం పార్టీల పెద్ద పొరపాటే అవుతుంది. వారు నిశ్శబ్దంగా గమనించే సైలెంట్ ఓటర్లు . బూత్ లెవల్‌కి వచ్చి ఓటు వేసే సమయంలో సాంప్రదాయ కుల, ప్రాంతీయ సమీకరణల కంటే.. వ్యక్తిగత స్వాతంత్ర్యం, ఉద్యోగ కల్పన, పారదర్శక పాలన అందించే నాయకులకే ప్రాధాన్యత ఇస్తారు.

ఏదైనా ఒక రాజకీయ పార్టీ తమ సొంత ప్రయోజనాల కోసం తమను పొలిటికల్ టూల్ గా వాడుకోవాలని చూస్తే తిరస్కరించడంలో ఈ తరం ముందే ఉంటుంది. నాయకులు కేవలం మీమ్స్‌కే పరిమితం కాకుండా, వారి భవిష్యత్తుకు భరోసానిచ్చే విజన్‌ను చూపినప్పుడే ఈ తరం ఓటర్లు నిజమైన మద్దతుదారులవుతారు.



- సిండికేట్ ఏర్పాటు.. మూకుమ్మడి నిర్ణయం
- క్వార్టర్‌పై రూ.10.. ఫుల్ బాటిల్‌పై రూ.30-40 అదనం..?
- అనధికారిక పర్మిట్ రూమ్‌లు.. బెల్ట్ షాపులు
- పట్టించుకోని ఎక్సైజ్ యంత్రాంగం...!

# మద్యం ఎమ్మార్పీకి మంగళం..!

అనంతపురం / పామిడి– సూర్య వాస్తవం :

అనంతపురం జిల్లాలో...పామిడి మండలంలోని మద్యం విక్రయాల్లో నిబంధనలు గాలికొదిలేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మార్పీకి మద్యం విక్రయించాల్సి ఉండగా.. పలుచోట్ల అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికితోడు ప్రతి గ్రామంలో ఇద్దరు ముగ్గురు అనధికారికంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు, నిర్వాహకులు సిండికేట్‌గా ఏర్పడి ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం ఎమ్మార్పీకి విక్రయించాలి. బెల్ట్ షాపులు నిర్వహించకూడదు. అనధికారికంగా పర్మిట్ రూమ్‌లు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే పామిడి మండలంలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ఉల్లంఘనలను అరికట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ఎమ్మార్పీ కంటే అధికంగా వసూళ్లు

మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రతిరోజు మందుబాబులు ఏందో ఒక మద్యం షాపు దగ్గర గొడవలు జరుగుతూనే ఉన్నాయి వీటిని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు ఎక్స్చేంజ్ అధికారులు ఉదాహరణకు రూ.200 ఎమ్మార్పీ ఉన్న క్వార్టర్ బాటిల్‌కు రూ.220 వరకు వసూలు అలాగే బీరు బాటిల్ పై రెండువందల అమ్మాల్సిన బీరు 200 అదనంగా 30 రూపాయలు వసూలు అమ్ముతున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. రూ.800 ఎమ్మార్పీ ఉన్న ఫుల్ బాటిల్‌కు రూ.820 లేదా అంతకంటే ఎక్కువ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని బ్రాండ్ల ఫుల్ బాటిళ్లపై రూ.30 నుంచి రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని మందు బాబులు వాపోతున్నారు.

### బెల్ట్ షాపులకు అడ్డుకట్ట ఏది?

మద్యం దుకాణాల పరిధిలో బెల్ట్ షాపులు పెరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఒక్కో దుకాణం పరిధిలో పలుచోట్ల బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

### అనధికారిక పర్మిట్ రూమ్‌లు

మద్యం దుకాణాల వద్ద అనుమతి లేని పర్మిట్ రూమ్‌లు కూడా నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రారంభంలో ఎమ్మార్పీకి మాత్రమే మద్యం విక్రయించిన నిర్వాహకులు.. క్రమంగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని వినియోగదారులు చెబుతున్నారు. పర్మిట్ రూమ్‌లు, బెల్ట్ షాపుల విషయంలో అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### సిండికేట్ ఆరోపణలు

మద్యం దుకాణాల నిర్వాహకులు మూకుమ్మడిగా నిర్ణయాలు తీసుకుంటూ అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారన్న ఆరోపణలు తాజాగా తెరపైకి వచ్చాయి. ఒకే విధంగా ధరలు పెంచి వసూలు చేస్తున్న నేపథ్యంలో సిండికేట్ వ్యవహారం నడుస్తోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.




### అధికారుల పర్యవేక్షణపై విమర్శలు

మద్యం విక్రయాల్లో నిబంధనలు అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ఎక్సైజ్ యంత్రాంగంపై ఉంది. ఎమ్మార్పీ ఉల్లంఘన, బెల్ట్ షాపులు, అనధికారిక పర్మిట్ రూమ్‌లపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే నిబంధనల ఉల్లంఘనలపై అధికారులు తగిన స్థాయిలో స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మద్యం దుకాణాల నిర్వాహకులు, ఎక్సైజ్ అధికారుల మధ్య కుమ్మక్కు ఉందన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నప్పటికీ.. వాటిని నిర్ధారించాల్సి ఉంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ అమలు, బెల్ట్ షాపులు, అనధికారిక పర్మిట్ రూమ్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఎమ్మార్పీకి మద్యం విక్రయించేలా చర్యలు తీసుకుంటారా? బెల్ట్ షాపులు, అనధికారిక పర్మిట్ రూమ్‌లపై కొరడా ఝుళిపిస్తారా? అన్నది వేచి చూడాలి.

# ప్రభుత్వ ఆసుపత్రి అడ్డాగా అంబులెన్స్‌ల దందా..!




- ఈ దోపిడీని అడ్డుకునే నాధుడు ఎవరు...?
- ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అంబులెన్స్ ఛార్జీలపై పేదల ఆవేదన
- ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బెంగళూరుకు రూ.8 వేల నుంచి రూ.9 వేల...?
- పేద రోగులపై అదనపు ఆర్థిక భారం ఎందుకు?
- అంబులెన్స్ ఛార్జీలపై పారదర్శకత ఏదీ?
- ప్రభుత్వ ఆసుపత్రి వద్దే అధిక ఛార్జీలంటూ ఆరోపణలు
- ఒకే దూరానికి వేర్వేరు ఛార్జీలపై సామాన్యుల ప్రశ్న
- అంబులెన్స్ ఛార్జీలపై ఉన్నతధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి
- అంబులెన్స్ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ప్రజల డిమాండ్

అనంతపురం వైద్యం – సూర్య వాస్తవం

అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బెంగళూరుకు రోగులను తరలించే అంబులెన్సుల ఛార్జీలపై పేద, సామాన్య వర్గాల నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నుంచి బెంగళూరుకు రోగులను తీసుకెళ్లేందుకు కొందరు అంబులెన్స్ నిర్వాహకులు రూ.8 వేల నుంచి రూ.9 వేల వరకు వసూలు చేస్తున్నారని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు.

అదే సమయంలో ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి బెంగళూరుకు వెళ్లే అంబులెన్సులకు సుమారు రూ.6 వేల నుంచి రూ.6,500 వరకు ఛార్జీలు వసూలు చేస్తున్నారని వారు చెబుతున్నారు.

రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునే నిరుపేదలకు అనారోగ్యం అదనపు ఆర్థిక భారంగా మారుతోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగిని మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించాలని వైద్యులు సూచించిన సమయంలో కుటుంబ సభ్యులకు అంబులెన్స్ ఛార్జీలు మరో పెద్ద భారంగా మారుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పిల్లల చదువులు, కుటుంబ పోషణ, నిత్యావసర ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలు అత్యవసర పరిస్థితుల్లో అప్పులు చేసి రోగులను బెంగళూరుకు తరలించాల్సి వస్తోందని చెబుతున్నారు. ఒకే ప్రయాణానికి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎక్కువ ఛార్జీలు, ప్రైవేట్ ఆసుపత్రి వద్ద తక్కువ ఛార్జీలు ఎందుకు ఉంటున్నాయనే ప్రశ్నను సామాన్యులు లేవనెత్తుతున్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారంతా ఆర్థికంగా బలమైన వారేనా?

అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల పరిస్థితిని పరిగణనలోకి తీసుకోకుండా అధిక మొత్తంలో అంబులెన్స్ ఛార్జీలు వసూలు చేయడం సమంజసం కాదని పలువురు అంటున్నారు. అంబులెన్స్ ఛార్జీల విషయంలో స్పష్టమైన ధరల పట్టిక, పారదర్శకత ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అంబులెన్స్ నిర్వాహకులు మానవతా దృక్పథంతో ఆలోచించి నిరుపేద కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఇతర నగరాలకు రోగులను తరలించే అంబులెన్స్ ఛార్జీలపై సంబంధిత అధికారులు విచారణ చేసి, నిబంధనలకు అనుగుణంగా ఛార్జీలు వసూలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు

# వివాహ వేడుకలకు హాజరైన ఆర్థిక మంత్రి

### నూతన వధూవరులను ఆశీర్వదించిన పయ్యావుల కేశవ్



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** నగరంలోని ఆర్కె ఫంక్షన్ హాల్లో కూడేరు మండలం కడదరగుంట గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు నూతనపాటి చలపతి కుమార్తె వివాహ వేడుకలకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఉరవకొండ పట్టణంలోని సత్యం ఫంక్షన్ హాల్లో ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీ శ్రీనివాసులు గారి కుమార్తె వివాహ వేడుకలకు మంత్రి పయ్యావుల కేశవ్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

# జేసీ దివాకర్ రెడ్డి, జేసీ ప్రభాకర్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

- మాజీ మంత్రి జేసీ దివాకర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- తాడిపత్రిలో మహిళా సాధికారతపై ప్రత్యేకంగా చర్చ



**శింగనమల - సూర్య వాస్తవం :** మాజీ మంత్రి జేసీ దివాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డిలను ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జేసీ దివాకర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డితో సమావేశమై తాడిపత్రి నియోజకవర్గంలో మహిళా సాధికారత కోసం చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలపై చర్చించారు. మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, వాటి ద్వారా మహిళలకు కలుగుతున్న ప్రయోజనాలపై ఇరువురు చర్చించారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. మహిళా సాధికారతతో కుటుంబాలతో పాటు సమాజం కూడా మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలతో పాటు తాజా రాజకీయ పరిస్థితులపై కూడా చర్చించినట్లు తెలిపారు.

# దేశభక్తి భావనను బలోపేతం చేయాలి

- త్యాగధనుల స్ఫూర్తితో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి
- హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఆదినారాయణ యాదవ్...!



**ముదిగుబ్బ - సూర్య వాస్తవం:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ముదిగుబ్బ మండలంలో శుక్రవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ముదిగుబ్బ మండల పరిషత్ అధ్యక్షులు ( ఎంపీపీ ), రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరంగా దేశ గౌరవం, త్యాగాలు, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావనను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. దేశం కోసం ప్రాణాలను అర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు వై. చంద్రమోహన్, బీజేవైఎం మండల అధ్యక్షులు శివకుమార్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి శపనీంద్ర గౌడ్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రసాద్, ముదిగుబ్బ మండల ఎంపీడీవో హజావలి, బీజేపీ నాయకులు, మండల మోర్చాల నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# డిసెంబర్ నాటికి 3 వేల టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తాం

- 54వ ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి అర్జీల స్వీకరించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- నీరజ కుటుంబానికి ఎల్ఓసీ ద్వారా రూ.5 లక్షల సాయం



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** డిసెంబర్ నాటికి 3 వేల టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన 54వ ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నగరానికి చెందిన నీరజ కుటుంబానికి ఎమ్మెల్యే స్పందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఎల్ఓసీ ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సాయం మంజూరైన పత్రాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఇప్పటివరకు 54 సార్లు ప్రజా దర్బార్ నిర్వహించామని ఎమ్మెల్యే తెలిపారు. మొత్తం 1,227 అర్జీలు అందగా, 1,179 సమస్యలను పరిష్కరించామని, మరో 45 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. అర్జీల్లో ఎక్కువగా హౌసింగ్, పింఛన్ సమస్యలు ఉన్నాయని, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతున్నందువల్లే ప్రస్తుతం అర్జీల సంఖ్య తగ్గుతోందన్నారు. 2014-19 మధ్యకాలంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని దాదాపు పూర్తి చేశామని, అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఇళ్లకు కేవలం పార్టీ రంగులు వేసి అసలైన లబ్ధిదారులకు అన్యాయం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే చర్యలు చేపట్టిందన్నారు.

కొత్త పింఛన్లు కూడా త్వరలోనే మంజూరవుతాయని, ఈ నెలాఖరు లేదా వచ్చే నెలలో కొత్త పింఛన్లు అందే అవకాశం ఉందని ఎమ్మెల్యే చెప్పారు. మెగా డీఎస్సీ విషయంలో వైసీపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. 150 రోజుల్లో 16,347 పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేశామని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయంటూ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, ఆధారాలు చూపించాలని కోరితే వైసీపీ నాయకులు ముందుకు రావడం లేదన్నారు. అనంతపురం జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. పుట్టపర్తిలో యుద్ధ విమానాల పరిశ్రమను తీసుకురావడం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కృషితోనే సాధ్యమైందని పేర్కొన్నారు.

# మచ్చలేని ప్రజానాయకుడు సర్పంచ్ కావాలి

- సర్పంచ్ రేసులో ప్రజాదరణ కలిగిన నాయకుడు.(వైయు రామాంజనేయులు)



**పామిడి - సూర్య వాస్తవం :** మండల కేంద్రమైన పామిడి మేజర్ పంచాయతీకి మచ్చలేని ప్రజానాయకుడు కోసం ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సర్పంచుల రేసులో పలువురు ప్రజాధరుల కలిగిన నాయకులలో వైయు రామాంజనేయులు ఉండడం ప్రజలు హర్షిస్తున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. ఈయన గతంలో పామిడి పట్టణం మున్సిపాలిటీగా ఉన్న కాలంలో 7వ వార్డు కౌన్సిలరుగా ప్రజల మన్ననలతో భారీ మెజార్టీతో గెలుపొంది ఆ వార్డులో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు పామిడి పట్టణ ప్రజలకు తెలుపుతూ వైయు రామాంజనేయులు 2014 నుండి 2019 వరకు 7వ వార్డ్ కౌన్సిలరుగా ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ఆయన సద్వినియోగం చేసుకునేందుకు టీచర్స్ కాలనీ నందు సిసిరోడ్లు, డ్రైనేజీలు, త్రాగునీటి పైపులైన్ తోపాటు కుళాయిలు ఏర్పాటు చేయించారు. ఇంటింటి చెట్లు లాటించి దాదాపు 60 లక్షలతో అభివృద్ధి పపనులు చేయడం జరిగింది. అలాగే చాకలి వీధిలో అప్పారావు ఇంటి దగ్గర నుంచి 40 లక్షలతో అభివృద్ధి చేయడం జరిగింది. రాజకీయ పార్టీలకు అతీతంగాఎవరు వచ్చినా పని చేసి పెట్టామని, వై యు రామాంజనేయులు తెలిపారు. ఇంతవరకు ప్రజా సేవలు పరమ దైవముగా భావించామని ఎక్కడా అవినీతి, అక్రమాలు, కబ్జాలు తావు ఇవ్వకుండా సేవలందించమన్నారు. ఎవ్వరితో కూడా పైసా తీసుకోకుండా ప్రజలకి ఇబ్బంది కలిగించకుండా ప్రతి ఒక్కరికి పని చేసామని, అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ మానవసేవయే మాధవ సేవగా జీవిస్తామన్నారు. ప్రజల కోరిక మేరకు జరగబోయే స్థానిక ఎన్నికల్లో సర్పంచుగా పోటీ చేస్తున్నామన్నారు. ఓటరుదేవుల్లు ఆ అవకాశాన్ని కల్పిస్తే పామిడి పంచాయతీ పరిధి అంతయు అభివృద్ధిలో భాగంగా పామిడి పంచాయతీ నూతన కార్యాలయం, అలాగే పంచాయతీ కాంప్లెక్సులు నిర్మిస్తామని పామిడి పంచాయతీ స్థలాలు ఎక్కడున్నా క్రమబద్దీకరణ చేయడం, రోడ్లు విస్తీర్ణము, మెయిన్ బజారుని వెడల్పు చేయాలన్నారు.. గత 20 సంవత్సరాలుగా టీడీపీ పార్టీలో ఉంటూ,పార్టీ జెండాను మోస్తూ,పార్టీ కోసం అహర్నిశలు పని చేసామన్నారు.. పదవిలో ఉన్నంత కాలం ప్రజల సేవలో ప్రజల కోసం ప్రజలకు తోడు ప్రజలకు అండగా ఉన్నామన్నారు. మరొక అవకాశం కల్పించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ప్లాస్టిక్ ఫ్లెక్సీల వినియోగం తగ్గించాలి

- ప్రజా దర్బార్ లో ఎమ్మెల్యేకి వినతి పత్రం ఇచ్చిన డిస్కవర్ అనిల్ కుమార్...!
- ప్రజాప్రతినిధుల కార్యక్రమాల్లోనూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి
- రోడ్డుపై పెడుతున్న ఫ్లెక్సీలతో వాహనదారులకు ప్రమాదం
- చారిత్రక కట్టడాలు, విగ్రహాలు కనిపించకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయొద్దు
- ప్లాస్టిక్ నియంత్రణలో ప్రజాప్రతినిధులే ఆదర్శంగా నిలవాలి



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం:** అనంతపురం ప్రజాప్రతినిధుల కార్యక్రమాల్లో ప్లాస్టిక్ ఫ్లెక్సీల వినియోగాన్ని తగ్గించాలని డిస్కవర్ అనిల్‌కుమార్ కోరారు. అనంతపురం టీడీపీ అర్బన్ కార్యాలయంలో ఎమ్మెల్యే నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన ఈ మేరకు అర్జీ సమర్పించారు. ప్రజా ప్రతినిధుల కార్యక్రమాలు, వివిధ పార్టీల నాయకుల పుట్టినరోజు వేడుకలు, శుభాకాంక్షల ఫ్లెక్సీలు, ధర్నాలు తదితర కార్యక్రమాల సందర్భంగా నగరంలోని కూడళ్ల వద్ద పెద్ద సంఖ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. గాలికి కొన్ని ఫ్లెక్సీలు రోడ్లపై పడిపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు, ప్రమాదాల ముప్పు ఏర్పడుతోందన్నారు. అలాగే కూడళ్ల వద్ద ఏర్పాటు చేసే ఫ్లెక్సీల కారణంగా చారిత్రక కట్టడాలు, విగ్రహాలు ప్రజలకు కనిపించకుండా అడ్డు పడుతున్నాయని పేర్కొన్నారు. ఎవరైనా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే సమయంలో పరిసరాలను గమనించి, చారిత్రక కట్టడాలు, విగ్రహాలు, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నగరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల సైడ్ డ్రెయిన్లు, కాలువలు కూరుకు పోతున్నాయని, దీంతో పారిశుధ్యం, పర్యావరణం, ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని అనిల్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాల్సిన ప్రజాప్రతినిధులే తమ కార్యక్రమాల్లో ప్లాస్టిక్ ఫ్లెక్సీల వినియోగాన్ని తగ్గించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రహదారులపై ఫ్లెక్సీలు పడకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు, నగరంలోని కూడళ్లలో ఫ్లెక్సీల ఏర్పాటుపై నియంత్రణ విధించాలని కోరారు.



## వర్షపు నీరు రోడ్లపైకి రాకుండా శాశ్వత చర్యలు

- డ్రైనేజీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- పనులు వేగవంతంగా, నాణ్యతగా చేపట్టాలని ఆదేశం



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం:** నగరంలో వర్షపు నీరు రోడ్లపైకి చేరకుండా డ్రైనేజీ వ్యవస్థకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడుతున్నామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. శుక్రవారం లక్ష్మీనగర్‌లోని రవి పెట్రోల్ బంక్ వద్ద సర్వీస్ రోడ్డులో జరుగుతున్న డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. చిన్నపాటి వర్షానికే రోడ్డు పైకి నీరు చేరి వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఇక్కడ శాశ్వత పరిష్కారం కోసం పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. భారీ పైప్‌లైన్లను ఏర్పాటు చేసి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా నిర్మాణాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పనులను పరిశీలించిన ఎమ్మెల్యే.. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులను పకడ్బందీగా చేపట్టాలని, పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. లక్ష్మీనగర్‌లో గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న డ్రైనేజీ సమస్యను ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పరిష్కరిస్తున్నామని తెలి పారు. నగరంలోని పలు ప్రాంతాల్లోనూ ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.

## ఏపీ రైతు సంఘం నాయకుల భారీ ప్రదర్శన




**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు భారీ ప్రదర్శన నిర్వహించారు. సోలా ర్ కంపెనీల నుంచి రైతుల భూము లను కాపాడాలని నినాదంతో సో లార్ కంపెనీల మోసపూరిత ఒప్పం దాలపై చేపట్టిన సోలార్ బాధిత రై తుల రాష్ట్ర సదస్సులో భాగంగా గు త్తిలోని ఆర్ అండ్ బి అతిథి గృహం నుంచి గాంధీ కూడలి మీదుగా నిజా మి ఫంక్షన్ హాలు వరకు నాయకు లు,కార్యకర్తలు,రైతులు ప్రదర్శన చే శారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కా ర్యదర్శి కె.ప్ర భాకర్ రెడ్డి,అధ్యక్షులు వి.కృష్ణయ్య, అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు కె.చంద్రశే ఖర్ రెడ్డి,వెంకటేశ్వర్లు, రామకృష్ణ హరి, పెద్దన్న, రామకృష్ణుడు, రాజశేఖర్, దస్తగిరి, గోపాల కృష్ణయ్య, రాష్ట్ర కమిటీ నాయకులు పి.హనుమంతు, సుబ్బ రాయుడు, రాజారామి రెడ్డి, శివారెడ్డి, విరుపాక్షి, సిఐటియు అనంతపురం జిల్లా కార్యదర్శి నాగేంద్ర కుమార్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, వృత్తి దారుల సంఘం జిల్లా కార్య దర్శి శ్రీనివాసులు,స్థానిక ప్ర జాసం ఘాల నాయకులు వి.నిర్మల, ఎన్.రేణుక, ఎం.మల్లేష్, దస్తగిరి, సి.రమేష్, యు.మల్లికార్జున, మద్దిలేటి, రేవతి, నవీన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఉచిత కంటి వైద్య శిబిరం



**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణం లోని శ్రీవాసవి కళ్యాణమండపం (అమ్మవారి శాల )లో 16వ తేదీ ఆదివారమున పామిడి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రఖ్యాతి చెందిన బెంగుళూరు శంకరకంటి నేతృత్వంలో ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు మరియు లైన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు పట్రాశ్రీనివాసులు, లైన్స్ క్లబ్ సభ్యులు పత్రికా ప్రకటనలో తెలిపారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి యొక్క కంటి వైద్యనిపుణులు కంటి చూపు మందగించిన వారిని పరీక్షించి అవసరమైతే అన్ని రకాల కంటి ఆపరేషన్లకు ఉచితముగా ఆపరేషన్లు చేస్తారు. శంకర కంటి ఆసుపత్రి వారు ప్రత్యేక బస్సుల్లో బెంగళూరుకు తీసుకెళ్లి ఆపరేషన్లు అనంతరం తిరిగి గమ్య స్థానాలకు చేరుస్తారని వారు తెలియజేశారు. కంటి వైద్య శిబిరానికి హాజరయ్యే వారు రెండు ఆధార్ కార్డు జిరాక్సులు,రెండు పాస్ ఫోటోలు తీసుకొని రావాలని తెలియజేశారు. ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని పామిడి మండల ప్రజలే గాక చుట్టూ ప్రక్కల ఉన్నటు వంటి మండలాల కంటి జబ్బులు గల ప్రజలు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు విజ్ఞప్తి చేశారు.

## నేడు పాత వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి మండలంలోని తమ్మళ్ళపల్లి గ్రామ పొలం ప్రాంతంలోని పెద్దవడుగురు గ్రామంసమీపంలో ఉన్న వీరభద్రస్వామి (గుడ్లవీరన్న)దేవాలయం ఆవరణంలో ఉన్న మహిమానితుడైన పాతవీరభద్రస్వామి వారి విగ్రహమును నేడు శనివారం పునఃప్రతిష్టించుట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దవడుగూరు నివాసి అయిన రిటైర్డ్ హాస్టల్ వార్డెన్ పట్రా.బసవరాజు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి అయ్యే వ్యయములకు ఆర్థిక సహాయ,సహకారాలు అందిస్తున్నట్లు ఆలయకమిటీ వారు తెలిపారు. కావున నేడు ఉదయం 8:30 గంటలకు నిష్టాగలిస్టులై భక్తిశ్రద్ధలతో పురోహితులచే పునఃప్రతిష్టను నిర్వహిస్తున్న కార్యక్రమానికి యావన్మంది స్వామిభక్తాదులు, కమిటీ సభ్యులు అందరూ గుడ్లవీరభద్రస్వామి (గుడ్లవీరన్న) దేవాలయంనకు నేటిఉదయమే చేరుకోవలసినదిగా వారు తెలిపారు.

# అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- రూ.46 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు స్వాధీనం
- అనంతపురం టూటౌన్, రూరల్ పరిధిలో 8 కేసులు ఛేదింపు
- అంతర్‌జిల్లా ముఠాలో 12 మంది అరెస్ట్.. ఐదుగురు మైనర్లు
- మహిళలు, వృద్ధులే టార్గెట్.. బస్సులు, ఆటోల్లో చోరీలు
- దృష్టి మళ్లించి హ్యాండ్‌బ్యాగుల్లోని ఆభరణాల అపహరణ
- పలు జిల్లాల్లోనూ నిందితులపై నేర చరిత్ర



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం:** అనంతపురం ప్రయాణికులు, మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని బస్సులు, ఆటోల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా ముఠాను అనంతపురం పోలీసులు అరెస్ట్ చేశారు. ముఠాకు చెందిన 12 మందిని అదుపులోకి తీసుకోగా, వీరిలో ఏడుగురు పెద్దలు కాగా మరో ఐదుగురు మైనర్లు ఉన్నారు. నిందితుల నుంచి రూ.46 లక్షల విలువైన 313.14 గ్రాముల బంగారు ఆభరణాలు, 100 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.2.50 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్, వెల్లడించిన వివరాల ప్రకారం.. గుత్తి ప్రాంతానికి చెందిన నిందితులు ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించారు. ఆర్టీసీ బస్‌స్టాండ్లు, రద్దీ ప్రాంతాలు, ఆటోల్లో ప్రయాణించే మహిళలు, వృద్ధులను టార్గెట్ చేసేవారు. ప్రయా ణికుల మాదిరిగా బస్సులు, ఆటోల్లో ఎక్కి బాధితుల దృష్టిని మళ్లించి, పర్సులు, బ్యాగుల్లోని నగదు, బంగారు ఆభరణాలను చోరీ చేసేవారు. కొన్నిసార్లు తోటి ప్రయాణికుల దృష్టి మళ్లించేందుకు కాళ్లతో ఆటంకం కలిగిస్తూ చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఒక కేసు దర్యాప్తుతో ముఠా గుట్టురట్టు 2025 నవంబర్ 7న అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లికి చెందిన ఓ మహిళ ఆటోలో అనంతపురం వస్తుండగా, ముఠాకు చెందిన మహిళలు ఆమెతో పాటు ఆటోలో ఎక్కారు. దృష్టి మళ్లించి ఆమె హ్యాండ్‌బ్యాగ్‌లోని 25 తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. బాధితురాలి ఫిర్యాదుతో అనంతపురం 2-టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో కీలక ఆధారాలు లభించడంతో ముఠా సభ్యులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అనంతపురం టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గతంలో నమోదైన మరో ఏడు కేసుల వివరాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో మొత్తం ఎనిమిది కేసులను ఛేదించి చోరీ సొత్తును రికవరీ చేశారు. పలు జిల్లాల్లో నేర చరిత్రఅరెస్టయిన నిందితులకు గతంలో కూడా పలు జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడిన నేర చరిత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రకాశం జిల్లాలో ఒక కేసు, కడపలో రెండు, బనగానపల్లిలో ఒకటి, జమ్మలమడుగులో మూడు, తిరుపతిలో రెండు, నెల్లూరులో రెండు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఆదేశాల మేరకు అనంతపురం అర్బన్ డీఎస్పీ ఎం. చంద్రశేఖర్ పర్యవేక్షణలో అనంతపురం 2-టౌన్ సీఐ కె. పుల్లయ్య ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టి ముఠాను అరెస్ట్ చేశారు. ఆగస్టు 14 ఉదయం 10 గంటలకు నిందితులను అరెస్ట్ చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించి చోరీ సొత్తును రికవరీ చేసిన 2-టౌన్ సీఐ కె. పుల్లయ్య, ఎస్సైలు సి. రుషేంద్ర బాబు, బి. రామకృష్ణ, ఎన్. కరిష్మా, పీసీలు అంజన్ కుమార్, జి. సుధాకర్, బి. సుధాకర్, వి. రామాంజినేయులు, పాండవతో పాటు హెచ్‌సీలు, మహిళా పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



# అందుబాటు ధరల్లో మెరుగైన బిఎస్ఎన్ఎల్ టెలికాం సేవలే లక్ష్యం

- స్వదేశీ 4జీ/5జీ టెక్నాలజీతో సేవల విస్తరణ
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో 332 బీటీఎస్‌ల ఏర్పాటు
- గ్రామీణ ప్రాంతాల్లో మరో 72 గ్రామాలకు మొబైల్ కనెక్టివిటీ
- బీఎస్ఎన్ఎల్ ఉమ్మడి జిల్లా జీఎం షేక్ ముజీబ్ పాషా



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అందుబాటు ధరల్లో నాణ్యమైన, మెరుగైన టెలికాం సేవలను వినియోగ దారులకు అందించడమే లక్ష్యంగా బీఎస్ఎన్ఎల్ ముందుకు సాగుతోందని ఉమ్మడి అనంతపురం జిల్లా జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా తెలిపారు. అనంతపురంలోని బీఎస్ఎన్ఎల్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన సంస్థ అందిస్తున్న సేవలు, చేపడుతున్న ప్రాజెక్టుల వివరాలను వెల్లడించారు. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా సీ-డాట్, టీసీఎస్, తేజాస్ నెట్‌వర్క్స్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన స్వదేశీ 4జీ/5జీ టెక్నాలజీ స్టాక్‌ను బీఎస్ఎన్ఎల్ ఫేజ్ ×శ.2 కింద విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. అనంతపురం ఆపరేషనల్ ఏరియా పరిధిలో ఫేజ్ ×శ.2 4జీ ప్రాజెక్ట్ కింద మొత్తం 332 బీటీఎస్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ సైట్లు రోజుకు సుమారు 25 టీబీ డేటా ట్రాఫిక్‌ను నిర్వహిస్తున్నాయని, దీంతో మొబైల్ ఇంటర్నెట్ కనెక్టివిటీ గణనీయంగా మెరుగు పడిందన్నారు. అదనంగా అనంతపురం ఓఏ పరిధిలో 294 2జీ బీటీఎస్‌లు పని చేస్తున్నాయని తెలిపారు. వీటి ద్వారా వినియోగదారులకు విశ్వసనీయమైన 2జీ సేవలు అందుతున్నాయన్నారు. ప్రస్తుతం సుమారు 2.8 లక్షల ప్రీపెయిడ్, 2,500 పోస్ట్‌పెయిడ్ కనెక్షన్లు ఉన్నాయని వెల్లడించారు.

**మరో 72 గ్రామాలకు మొబైల్ కనెక్టివిటీ**

డిజిటల్ భారత్ నిధి (డీబీఎన్) ప్రాజెక్ట్ కింద అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో మొత్తం 103 సాచ్యురేషన్ టవర్లు అమలు దశలో ఉన్నాయని జీఎం తెలిపారు. ఇందులో అనంతపురం జిల్లాలో 33, శ్రీ సత్యసాయి జిల్లాలో 70 టవర్లు ఉన్నాయన్నారు. ప్రస్తుతం మొబైల్ కనెక్టివిటీ లేని గ్రామాల్లో ఈ టవర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రతిపాదించిన 103 టవర్లలో 17 టవర్లు ఇప్పటికే ఏర్పాటు చేసి రేడియేట్ చేసినట్లు తెలిపారు. మిగిలిన 86 టవర్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ టవర్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రస్తుతం మొబైల్ కనెక్టివిటీ లేని మరో 72 గ్రామాలకు సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

**58 మండలాలకు ఎఫ్‌టీటీఎచ్ సేవలు**

బీఎస్ఎన్ఎల్ ఎఫ్‌టీటీఎచ్ హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు ఉమ్మడి జిల్లాలోని 63 మండలాల్లో 58 మండలాలకు విస్తరించినట్లు ముజీబ్ పాషా తెలిపారు. ఈ సేవల ద్వారా డిజిటల్ సేవలు, ఈ-గవర్నెన్స్, ఆన్‌లైన్ విద్య, టెలిమెడిసిన్, వినోదం, ఔత్సాహిక వ్యాపారాలకు మరింత ఊతం లభిస్తోందన్నారు. రెండు జిల్లాల్లో కలిపి ప్రస్తుతం సుమారు 13 వేల బీఎస్ఎన్ఎల్ ఎఫ్‌టీటీఎచ్ కనెక్షన్లు పనిచేస్తున్నాయని తెలిపారు. కార్పొరేట్ వినియోగదారులకు పోటీ ధరల్లో హైస్పీడ్ బ్యాండ్విడ్త్, వేగవంతమైన సేవలు, సత్వర సాంకేతిక సహాయాన్ని అందిస్తున్నామని చెప్పారు.

**మారుమూల ప్రాంతాలకు శాటిలైట్ సేవలు**

సాధారణ మొబైల్ నెట్‌వర్క్‌లు అందుబాటులో లేని మారుమూల ప్రాంతాలు, తీర ప్రాంతాలు, అత్యవసర పరిస్థితుల్లో శాటిలైట్ ద్వారా అంతరాయం లేకుండా వాయిస్ కాల్స్, టెక్స్ట్ మెసేజింగ్ సేవలను బీఎస్ఎన్ఎల్ శాటిలైట్ ఫోన్ అందిస్తుందని తెలిపారు.

**ఫ్రీడమ్ ప్లాన్లతో అదనపు ప్రయోజనాలు**

80వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా బీఎస్ఎన్ఎల్ పరిమిత కాలానికి ప్రత్యేక ఫ్రీడమ్ ప్లాన్లు ప్రారంభించిందని ముజీబ్ పాషా తెలిపారు. ఇందులో హైస్పీడ్ డేటా, అన్‌లిమిటెడ్ వాయిస్ కాలింగ్, పొడిగించిన వ్యాలిడిటీ వంటి ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఎఫ్ఆర్‌సీ 1 (ఫ్రీడమ్ 2.0) ప్లాన్‌లో రోజుకు 1 జీబీ హైస్పీడ్ డేటాతో పాటు 24 రోజులపాటు అన్‌లిమిటెడ్ వాయిస్ కాలింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక ఆఫర్ ఆగస్టు 12 నుంచి సెప్టెంబర్ 12 వరకు అందుబాటులో ఉంటుందన్నారు. అదేవిధంగా పీవీ 2399 వార్షిక ప్లాన్‌కు అదనంగా 47 రోజుల వ్యాలిడిటీ కల్పిస్తున్నట్లు చెప్పారు. దీంతో మొత్తం వ్యాలిడిటీ 412 రోజులకు పెరుగుతుందని, రోజుకు 2 జీబీ హైస్పీడ్ డేటా, అన్‌లిమిటెడ్ వాయిస్ కాలింగ్ లభిస్తాయని తెలిపారు. యాక్టివ్ బీఎస్ఎన్ఎల్ మొబైల్ వినియోగ దారులు బీఎస్ఎన్ఎల్ ఎంటర్‌టైన్మెంట్ టీవీ ద్వారా 500కు పైగా లైవ్ టీవీ ఛానళ్లు, సినిమాలు, ఆన్-డిమాండ్ కంటెంట్‌ను ఉచితంగా వీక్షించవచ్చని ఆయన వివరించారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా అందుబాటు ధరల్లో నాణ్యమైన, విశ్వసనీయమైన టెలికాం సేవలను విస్తరిస్తున్నామని ముజీబ్ పాషా తెలిపారు.

## రెండేళ్ల అభివృద్ధి-సంక్షేమంలో గడపగడపకు కరపత్రాలు పంపిణీ



**దొరవారిసత్రం-సూర్య వాస్తవం :** రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రచార కార్యక్రమమైన రెండేళ్ల అభివృద్ధి-సంక్షేమం అనే కార్యక్రమం ఎమ్మెల్యే నెలవల.విజయశ్రీ ఆదేశాలతో ముమ్మరంగా సాగుతుంది.ఈ క్రమం లోనే దొరవారిసత్రం మండల పరిధిలోని ఏకొల్లు గ్రామంలో శుక్రవారం ఆ గ్రామ నాయకులు ఈ కార్యక్రమాన్ని తలపెట్టారు. నెలబల్లి సొసైటీ ప్రెసిడెంట్ ముప్పాళ్ళ శ్రీహరి రెడ్డి, మాజీ ఎంపీటీసీ బందిలి ఉదయ్ కుమార్, యాగాని ఆదిముని లు కలిసి,దళితవాడ, గిరిజన కాలనీలో గడప గడపకు పర్యటించి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి,సంక్షేమం కరపత్రాలను అందిస్తూ ప్రచారం చేశారు.రాబోవు మూడేళ్లలో గ్రామాలకు అవసరమైన అభివృద్ధి పనులతో పాటు, పేదవాడికి అవసరమైన ఆర్థికపరమైన పథకాలను పూర్తి చేయడం జరుగుతుందని వివరించారు. రాబోవు స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థులు గెలుపుకు మీ సహాయ సహకారాలు కావాలని కూడా కోరారు.కార్యక్రమంలో నెలబల్లి సొసైటీ ప్రెసిడెంట్ శ్రీహరి రెడ్డి, మాజీ ఎంపిటిసి బదిలి.ఉదయ్ కుమార్,ఆదిముని తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన




**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ దిశా విభాగం సహకారంతో శుక్రవారం నవజీవన్ ఆర్గనైజేషన్-సి.సి-పి.యు ప్రాజెక్టు ఆధ్వర్యంలో సూళ్లూరుపేట పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో "ఇంటెన్సిఫైడ్ ఐ.ఇ.సి క్యాంపెయిన్" కార్యక్రమం ద్వారా హెచ్ఐవి,ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ కె.బాలాజి మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు,ఎలావ్యాపించదు,లక్షణాలు, అవి రాకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి,వ్యాధిగ్రస్తులు పట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా ఎలాగ సమాజంలో కలిసి జీవించాలి,సుఖ వ్యాధులు,చికిత్స,డ్రగ్స్ వాడకం వలన కలిగే ఇబ్బందులు,కండోమ్ ఉపయోగం తదితర విషయాలు వివరించారు., హెచ్ఐవి,ఎయిడ్స్ యాక్ట్ 2017,ఏ.ఆర్.టి మందులు, ఎ.పి.శాక్స్ యాప్,క్యు.ఆర్ కోడ్,సెల్ఫ్ రిస్క్ అసెస్ మెంట్,టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ జె.విజయబాబు రెడ్డి,లెక్చరర్ ఎ.సుధాకర్, ఓ.ఆర్.డబ్ల్యూ లు కె.మంజుల, టి.నందిని, పి.ఇలు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఆర్.టి.సి.బస్టాండ్ ప్రాంతంలో హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

## పాఠశాల విద్యార్థులకు శుభదిన భోజనం పంపిణీ



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** మండల పరిధిలోని తల్లంపాడు మోడల్ ప్రైమరీ స్కూల్‌లోని 101 మంది విద్యార్థులకు శుక్రవారం రుచికరమైన శుభదిన భోజనం అందించారు. చింతపూడి వినయ్ కుమారుడు జన్మదినం సందర్భంగా విద్యార్థులకు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విద్యాశాఖ అధికారి(2) కృష్ణయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ఉపాధ్యా యులు హుస్సేన్ బాబు,శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యం..మంత్రి సత్యకుమార్ బాధ్యత

**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** ఇటీవలే చికిత్స పొందిన చిన్నారి ఎస్.చంద్రికను అన్నమయ్య జిల్లా ములకలచెరువులోని వారి ఇంటి వద్దవెళ్లి మంత్రి శ్రీ సత్య కుమార్ చిన్నారి చంద్రకళను తల్లిదండ్రులను శుక్రవారం ఆప్యాయంగా పరామర్శించారు.ఈ సందర్భంగా మంత్రి చిన్నారికి ప్రస్తుతం అందుతున్న వైద్య సేవలు,చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.చిన్నారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ,త్వరగా పూర్తిగా కోలుకోవాలని మంత్రి గారు ఆకాంక్షించారు.ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం ఆలోచిస్తూ...అవసరమైన ప్రతి సమయంలో అండగా నిలుస్తున్న సేవా హృదయం -- సత్యకుమార్ యాదవ్ అన్ని చిన్నారి తల్లిదండ్రులు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.



# నాయుడుపేటలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

### - దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటిన కూటమి నాయకులు, జనసైనికులు

**నాయుడుపేట - సూర్య వాస్తవం:** భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కూటమి ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు నాయుడుపేట పట్టణంలో శుక్రవారం "హర్ ఘర్ తిరంగా" ర్యాలీ ని ఘనంగా నిర్వహించారు. సూళ్లూరుపేట నియోజకవర్గ శాసన సభ్యురాలు డా. నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో కూటమి నాయకులు, జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణం లోని గాంధీ మందిరం నుంచి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు జాతీయ జెండాలను చేతబూని ర్యాలీ నిర్వహించారు. త్రివర్ణ పతాకాలను చేతుల్లో పట్టుకుని విద్యా ర్థులు, యువతీ యువకులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొనడంతో నాయుడుపేట పట్టణం దేశభక్తి వాతావరణంతో మార్మోగింది.

ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు "వందే మాతరం", "భారత్ మాతాకీ జై" అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.



**విద్యార్థులు, యువతలో దేశభక్తి పెంపొందాలి**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు మహనీయులు చేసిన త్యాగాలను నేటి తరం ఎప్పటికీ స్మరించుకోవాలని తెలిపారు.

ముఖ్యంగా విద్యార్థులు, యువతలో దేశభక్తి, జాతీయ సమైక్యత, సామాజిక బాధ్యత మరింత పెంపొందాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ జెండా పట్ల ప్రతి ఒక్కరూ గౌరవభావంతో ఉండాలని, దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**దేశ ఐక్యతకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలి**

ఈ కార్యక్రమంలో నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ పాల్గొని జాతీయ జెండాను చేతబూని ర్యాలీలో నడిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధికి కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. దేశభక్తి భావనను ప్రతి కుటుంబంలో, ముఖ్యంగా యువతలో మరింతగా పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గంలోని జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ ర్యాలీలో కూటమి నాయకులు, జనసేన నాయకులు బాలు శెట్టి, చరణ్, కుమార్, జ్యోతిష్, దినేష్, వీర మహిళ రోహిణి, విద్యార్థులు, యువత, ప్రభుత్వ అధికారులు, పట్టణ పౌరులు తదితరులు పాల్గొన్నారు. భారీగా జాతీయ జెండాలతో నిర్వహించిన ఈ ర్యాలీ నాయుడుపేటలో దేశభక్తి, జాతీయ ఐక్యత స్ఫూర్తిని చాటింది.



## పాండురంగ స్వామి శిలాపూజ కార్యక్రమంలో పాల్గొన్న "మంత్రి సత్య కుమార్"



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** ధర్మవరం పట్టణంలోని ప్రఖ్యాత పాండురంగ స్వామి ఆలయ శిలాపూజ కార్యక్రమంలో శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్తి కుమార్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనుల కోసం కూటమి ప్రభుత్వం రూ.1,25,00,000 నిధులను మంజూరు చేసింది. 80 సంవత్సరాల ఘనమైన చరిత్ర కలిగిన ఈ ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయితే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. వస్తాయని మంత్రి తెలిపారు.వచ్చే ఉగాది నాటికి ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.ధర్మవరం ప్రాంత ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంది.రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు

## తిరంగాతో ధర్మవరం...దేశభక్తితో యువత!

### - జాతీయ జెండాను చేతబట్టి విద్యార్థులతో కలిసి అడుగు వేసిన మంత్రి సత్య కుమార్"



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పిలుపు మేరకు ధర్మవరంలో నిర్వహించిన తిరంగా యాత్రలో విద్యార్థులతో కలిసి మంత్రి సత్య కుమార్ పాలొగొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్



జాతీయ జెండాను చేతబట్టి విద్యార్థులతో కలిసి అడుగులు వేస్తూ దేశభక్తిని చాటిన మంత్రి తీరు ధర్మవరం పజలను విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది.ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాలు, బలిదానాల ఫలితంగా మనకు లభించిన స్వాతంత్ర్యాన్ని స్మరించు కుంటూ, ప్రతి ఇంటా తిరంగా,ప్రతి గుండెలో దేశభక్తి ఉండాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళు _న్నారు.అన్ని మంత్రి అన్నారు.స్వర్ణాంధ్రప్రదేశ్ కోసం...వికసిత భారత్ కోసం... మన అడుగులు అభివృద్ధి వైపు వేయాలి అన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు.

## ధర్మవరం ఏరియా ఆసుపత్రిలో నూతన ఓపీ కౌంటర్లను ప్రారంభించిన మంత్రి సత్య కుమార్"



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** ప్రతిరోజూ సుమారు 700--800 మంది,నెలకు 22,000--24,000 మంది రోగులు ఓపీ సేవలు పొందుతున్న నేపథ్యంలో,రోగులకు మరింత సులభంగా,వేగంగా వైద్య సేవలు అందించేందుకు ఈ నూతన ఓపీ కౌంటర్లను శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు, ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ,గత రెండేళ్లలో ధర్మవరం ఏరియా ఆసుపత్రిలో డాక్టర్ల లభ్యత, మందుల లభ్యత,అత్యాధునిక వైద్య పరికరాల అందుబాటు పెరగడంతో ప్రజల్లో ప్రభుత్వ వైద్య సేవలపై నమ్మకం మరింత పెరిగింది.అన్ని మంత్రి అన్నారు.దాదాపు రూ.2.10 కోట్ల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలు,10 పడకల డయాలసిస్ సెంటర్,బ్లడ్ బ్యాంక్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చాం.ధర్మవరం ఏరియా ఆసు పత్రిలోనే అధునాతన ల్యాపరోస్కోపిక్ శస్త్రచికిత్సలు నిర్వహించేలా వైద్య సదుపాయాలను బలోపేతం చేస్తున్నాం.అలాగే మా సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాల ద్వారా మోకాలి శస్త్రచికిత్సలు, కంటి శస్త్రచికిత్సలు, కాటరాక్ట్,రెటినా సర్జరీలు వంటి సేవలను ప్రజలకు అందిస్తున్నాం.అన్ని మంత్రి సత్య కుమార్ అన్నారు. ధర్మవరం ఏరియా ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి, ప్రజలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా, నిరంతరాయంగా అందించే ఆరోగ్య కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాంభూపాల్‌రెడ్డి,ఆసుపత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్ర నాయక్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హరి శ్రీనివాస్,హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు,ఏపీఎంఎస్ఐడీసీ డీఈఈ నవీన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో భాగ్యలక్ష్మి,డాక్టర్లు నరసింహులు,సోనియా,ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# 'విశ్వనాథ్ అండ్ సన్స్' మూవీ రివ్యూ



కుటుంబ కథలతో ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాలకు ఉన్న క్రేజ్, దాని బాక్సాఫీస్ లెక్కలు కూడా వేరుగా ఉంటాయి. కుటుంబ భావోద్వేగాలు, ఎంటర్‌టైన్‌మెంట్ జతకలిస్తే థియేటర్‌లు ఫ్యామిలీ ప్రేక్షకులతో కళకళలా డుతాయి. అందుకే కాబోలు గత కొంతకాలంగా ఫ్యామిలీ సినిమాలకు దూరంగా ఉన్న దర్శకులు, హీరోలు ఇప్పుడు అలాంటి సినిమాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ కోవలోనే హీరో సూర్య 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా తెరకెక్కిన ఈ చిత్రం ఎలా ఉంది? దర్శకుడు వెంకీ అట్లూరి హీరో సూర్యకు సక్సెస్‌ఫుల్ సినిమానిచ్చాడా? 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాలో ప్రేక్షకులు అలరించే అంశాలున్నాయా? లేదా? రివ్యూలో తెలుసుకుందాం. సంజయ్ విశ్వనాథ్ (సూర్య) ఓ సంపన్న వ్యాపార కుటుంబానికి చెందిన వారసుడు. ఒకవైపు బిజినెస్ చూసుకుంటూనే మరొక వైపు అమ్మ (రాధికా శరత్ కుమార్) కోరిక మేరకు రైఫిల్ షూటింగ్‌లో నైపుణ్యం సంపాందించి భారత్ తరపున ఒలింపిక్స్‌లో పాల్గొని బంగారు పతాకం గెలుస్తాడు. అయితే వివాహం విషయంలో ఆయన మనసులో ఉన్న ఓ అభిప్రాయం కారణంగా 40 ఏండ్లు దాటినా పెళ్లి చేసుకోడు. ఆయన చిన్నప్పుడు తన ఫ్యామిలీలో జరిగిన కొన్ని సంఘటనలే అందుకు కారణం. తల్లి మాత్రం పెళ్లి చేసుకుని కుటుంబానికి వారసుడిని ఇవ్వాలని సంజయ్‌ని పదే పదే కోరుతుంది. దీంతో ఓ డాక్టర్ సలహాతో అమెరికా వెళ్లి సరోగసి ద్వారా ఓ బాలుడిని కని ఇంటికి తీసుకొస్తాడు. అయితే అనుకోకుండా ఆ బాబు అనారోగ్యానికి గురవుతాడు. బాబు అనారోగ్యం నయం కావాలంటే కన్నతల్లి అవసరం పడుతుంది. దీంతో బాబు కన్నతల్లి గురించి అమెరికా వెళతాడు సంజయ్ విశ్వనాథ్. ఇక బాబుకు జన్మనిచ్చిన తల్లి దొరికిందా? అమెరికా నుంచి ఇండియాకు రావటానికి ఆమె ఒప్పుకుందా? ఒప్పుకుంటే ఎలా కండిషన్స్ పెట్టింది? సంజయ్ తల్లి కోరిక మేరకు పెళ్లి చేసుకున్నాడా? సంజయ్ జీవితంలో మ్యాడీ (మమిత బైజు) ఎలా వచ్చింది? ఆమె వచ్చిన తరువాత ఆయన జీవితంలో వచ్చిన మార్పులేమిటి? తదితర విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే. కుటుంబ భావోద్వేగాలతో కూడిన కథకు డీసెంట్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను జోడించి కుటుంబ మొత్తం హాయిగా కూర్చొని ఆస్వాదించే విధంగా ఉన్న ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. సినిమా ప్రారంభమైన తొలి సన్నివేశం నుంచే ఎంతో ఆహ్లాదంగా అనిపిస్తూ చివరి సన్నివేశం వరకు మనసుకు హత్తుకునే విధంగా ఈ సినిమాను మలిచారు దర్శకుడు వెంకీ అట్లూరి. హీరో సూర్యను ఇలాంటి స్టయిలిష్ రోల్‌లో చూసి చాలా రోజులైంది. ఆయన స్టైల్‌కు తగిన విధంగా ఓ బ్యాక్‌డ్రాప్‌ను ఎంచుకుని దానికి ఫ్యామిలీ ఎమోషన్స్‌ను మేళవించిన విధానం ఎంతో ప్రశంసనీయం. హీరో, హీరోయిన్ల మధ్య ఉన్న ఏజ్ గ్యాప్, సరోగసి ద్వారా బిడ్డను కనడం, దానితో ముడిపడిన ఎమోషన్స్, హీరోయిన్ క్యారెక్టర్‌ను డిజైన్ చేసిన విధానం ఎంతో బాగుంది. ఈ సినిమా చూస్తున్నంత సేపు ఓ మంచి సినిమా చూస్తున్నం అనే ఆనందం సినిమా చూసే ప్రేక్షకుడికి మనసుకి కలుగుతుంది. సినిమా ప్రారంభం నుంచి కూడా ఎక్కడా కూడా సినిమాను డ్రాప్ అవ్వకుండా దర్శకుడు వెంకీ అట్లూరి డీల్ చేసిన విధానం ప్రశంసనీయం. 'కోపం, ద్వేషం కూడా కొంతకాలం తరువాత అలిసిపోతాయి' వంటి సంభాషణలు ఆలోచింపజేస్తాయి. చాలా చోట్ల దర్శకుడు వెంకీ అట్లూరిలో త్రివిక్రమ్ గారి శైలి కనిపించింది. ముఖ్యంగా డ్రైవర్ ముత్తుస్వామి, ఆయన కొడుకుతో ఓ టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో సూర్య మాట్లాడిన విధానం, అంజలీ దేవి (రవీనా టాండన్) ఆమె కూతురు తల్లిదండ్రులతో ముడిపడిన సన్నివేశాలు ,అందరిని కంటతడి పెట్టిస్తుంది. ఇలాంటి ఎమోషన్ సన్నివేశాలు ఈ సినిమాలో అందరి హృదయాలకు హత్తుకోవడమే కాదు ఆలోచింపజేస్తాయి. ఈ సినిమాలో సూర్య మాస్ ఫ్యాన్స్ కోసం పెట్టిన యాక్షన్ ఏపిసోడ్స్ కూడా ఎంతో క్లాస్‌గానే ఉంటాయి. సినిమా ముగింపు కూడా ఎంతో క్లాస్‌గానే ఉంటుంది. సంజయ్‌గా హీరో సూర్య ఎంతో స్టయిలిష్‌గా కొత్త లుక్‌లో కనిపించాడు. సంజయ్ విశ్వనాథ్ పాత్రకు ఆయన వల్ల ఎంతో హుందాతనం వచ్చింది అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఆయన వయసును కనిపించకుండా దాచాలనే తాపత్రయం కూడా ఎక్కడా కనిపించదు. ఆయన నటన కొన్ని ఎమోషన్స్ సీన్స్‌ల్లో అందరిచేత భావోద్వేగానికి గురిచేసింది. ఇక ఈ సినిమాకు మరో హీరో మమిత బైజు ఆమె ఎనర్జీ, నటన ఈ సినిమాకు మరో బిగ్గెస్ట్ ప్లస్ పాయింట్. ఆ పాత్రను దర్శకుడు చాలా చక్కగా డిజైన్ చేశాడు. ఆమె నటన కూడా ఎంతో నేచురల్‌గా అనిపించింది. కథానాయకుడి తల్లిగా రాధికా శరత్‌కుమార్ నటన ఆకట్టుకుంది.సునీల్ రెడ్డి, రవీనా టాండన్, నాజర్ తదితరులు తమ పాత్రల్లో ఒదిగిపోయారు. జీవీ ప్రకాష్ కుమార్ నేపథ్య సంగీతం ఈ చిత్రానికి ఎమోషనల్ కంటెంట్ అనే ఫీల్‌ను కలిగిస్తుంది. ఫోటోగ్రఫీ ప్రతిభతో విజువల్స్ ఎంతో ప్లెజెంట్‌గా ఉన్నాయి. నిర్మాణ విలువలు బాగున్నాయి. ఈ మధ్య కాలంలో వచ్చిన వచ్చిన హార్ట్ టచ్చింగ్ క్లీన్ ఫ్యామలీ ఎంటర్ టైనర్ ఇది. ఒకవైపు ఎంటర్‌టైన్ చేస్తూనే మరో వైపు అందరి హృదయాలకు హత్తుకునే కథ, కథనాలతో సినిమా ఆద్యంతం అలరిస్తుందితప్పకుండా అందరూ ఫ్యామిలీతో చూడాల్సిన సినిమా.!



## నా మాటలనువక్రీకరించారు: అనసూయ భరద్వాజ్

**తాను సనాతన ధర్మాన్ని పాటిస్తానన్న అనసూయ**

**తాను శ్రీరాముడిని కొలుస్తానని వెల్లడి**

**తన కొడుకుని హనుమంతుడి పేరు పెట్టుకున్నానన్న అనసూయ**

హిందూ ధర్మం, సనాతన ధర్మంపై గతంలో తాను చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేగడంతో... సినీ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ సోషల్ మీడియా వేదికగా స్పందించింది. తన మాటలను కొందరు కావాలనే వక్రీకరించి ఉద్దేశపూర్వకంగా నెగిటివ్ ప్రచారం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.తాను ఏ మతాన్ని కించపరచనని, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తానని అనసూయ స్పష్టం చేసింది. తాను సనాతన ధర్మాన్ని పాటించే పక్కా హిందువునని, తన ధర్మం, విలువలు, విశ్వాసాల పట్ల తనకు ఎలాంటి అనుమానం లేదని పేర్కొంది. తాను చెప్పిన అసలు విషయాన్ని పక్కన పెట్టి, సనాతన ధర్మాన్ని అవమానించినట్లు ప్రచారం చేయడం సరికాదని హితవు పలికింది.అసలు ఏం జరిగిందంటే... గతంలో ఒక సందర్భంలో అనసూయ మాట్లాడుతూ.. 'జై శ్రీరామ్' అనే నినాదం ముసుగులో కొందరు దాడులకు తెగబడుతున్నారని, కేవలం నినాదాలు చేయడం కంటే వ్యక్తుల ప్రవర్తనే ముఖ్యమని వ్యాఖ్యానించడమే ఈ వివాదానికి కారణమైంది. సనాతన ధర్మం పేరుతో దాడులు చేయడాన్ని ప్రశ్నించిన ఆమె, తాను శ్రీరాముడినే కొలుస్తానని, ఆ భక్తితోనే తన పెద్ద కుమారుడికి హనుమంతుడి పేరు పెట్టుకున్నానని వివరించింది. ఈ వ్యాఖ్యలపై హిందూ సంఘాలు, నెటిజన్ల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవడంతో, పరిస్థితిని చక్కదిద్దేందుకు ఆమె తాజాగా ఈ వివరణ ఇచ్చింది.



# 600వ టెస్టు ముంగిట టీమిండియా..

## చరిత్రలో నిలిచిన 5 అద్భుత విజయాలు ఇవిగో!

భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో మరో సువర్ణాధ్యాయం ఆవిష్కృతం కానుంది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టీమిండియా తన 600వ టెస్ట్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. ఈ ఘనత సాధించిన మూడో దేశంగా భారత్ చరిత్ర సృష్టించనుంది. ఇప్పటివరకు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మాత్రమే ఈ మైలురాయిని అందుకున్నాయి. శనివారం (ఆగస్టు 15) నుంచి గాలే వేదికగా శ్రీలంకతో ప్రారంభం కానున్న తొలి టెస్టు, భారత్‌కు ఈ చారిత్రక ఘట్టానికి వేదిక కానుంది. ఇది కేవలం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ అవకాశాల కోసమే కాకుండా, భారత క్రికెట్ ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది.భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15న ఈ టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కావడం మరో విశేషం. ఈ అరుదైన సందర్భంపై భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పందిస్తూ, "600వ టెస్టుకు నాయకత్వం వహించడం ఎంతో గౌరవంగా ఉంది. అది కూడా స్వాతంత్ర్య దినోత్సవం రోజున కావడం మరింత పెద్ద గౌరవం" అని తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు. ఈ చారిత్రక సందర్భంలో, భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఐదు అద్భుత విజయాలను ఓసారి గుర్తుచేసుకుందాం.



**1. పోర్ట్ ఆఫ్ స్పెయిన్, 1976 – అసాధారణ ఛేజింగ్**

ఆ రోజుల్లో వెస్టిండీస్‌ను వారి సొంత గడ్డపై ఓడించడం, అందులోనూ 403 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడం ఒక కల మాత్రమే. అంతకుముందు 1948లో ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా మాత్రమే 400 పైచిలుకు లక్ష్యాన్ని ఛేదించింది. ఈ మ్యాచ్‌లో గెలుస్తామని సునీల్ గవాస్కర్ కూడా ఊహించలేదు. తన ఆత్మకథ 'సన్నీ డేస్'లో, "ఆ వికెట్‌పై మ్యాచ్‌ను కాపాడుకోగలమని నాకు నమ్మకం ఉంది కానీ, గెలుస్తామనే ఆలోచన నా మనసులోకి అస్సలు రాలేదు" అని రాసుకున్నాడు. కానీ, టీమిండియా అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది. చివరి రోజు గెలుపునకు 269 పరుగులు అవసరమైన దశలో, 'లిటిల్ మాస్టర్' సునీల్ గవాస్కర్ అద్భుతమైన సెంచరీ (102) సాధించగా, గుండప్ప విశ్వనాథ్ (112) శతకంతో కదం తొక్కాడు. బిషన్ సింగ్ బేడీ నాయకత్వంలోని జట్టు ఆ చారిత్రక లక్ష్యాన్ని ఛేదించి సంచలనం సృష్టించింది. మరుసటి రోజు ట్రినిడాడ్ ఎక్స్‌ప్రెస్ పత్రిక "చరిత్రను ధిక్కరించిన భారత్, వెస్టిండీస్‌పై ఘన విజయం" అనే శీర్షికతో ప్రశంసించింది.

**2. కోల్‌కతా, 2001 – ఫాలో-ఆన్ మ్యాజిక్**

పోర్ట్ ఆఫ్ స్పెయిన్ విజయం చారిత్రకమైతే, 2001లో కోల్‌కతాలో ఆస్ట్రేలియాపై సాధించిన విజయం టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే ఒక అద్భుతం. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 445 పరుగులు చేయగా, భారత్ కేవలం 171 పరుగులకే కుప్పకూలింది. 274 పరుగుల భారీ ఆధిక్యంతో ఫాలో-ఆన్‌లోకి నెట్టబడింది. ఆ దశలో భారత్‌కు అద్భుతం కంటే ఎక్కువే అవసరమైంది. అప్పుడే వీవీఎస్ లక్ష్మణ్, రాహుల్ ద్రవిడ్ మధ్య ఒక అపురూప భాగస్వామ్యం మొదలైంది. ఐదో వికెట్‌కు 376 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పి, భారత స్కోరును 657/7 వద్ద డిక్లేర్ చేసేలా చేశారు. దీంతో ఒక్కసారిగా ఆస్ట్రేలియా ఒత్తిడిలో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో హ్యాట్రిక్ సాధించిన హర్భజన్ సింగ్, ఐదో రోజు తన స్పిన్ మాయాజాలంతో ఆసీస్ బ్యాటింగ్ లైనప్‌ను కూల్చేశాడు. ఫలితంగా భారత్ 171 పరుగుల తేడాతో నమ్మశక్యం కాని విజయాన్ని అందుకుంది. ఈ గెలుపు నేటికీ అభిమానులకు గూస్‌బంప్స్ తెప్పిస్తుంది.

**3. అడిలైడ్, 2003 – ద్రవిడ్ వీరోచిత ప్రదర్శన**

ఈడెన్ గార్డెన్స్ అద్భుతం జరిగిన రెండేళ్లకు, అడిలైడ్‌లో ఆస్ట్రేలియాపై భారత్ మరో మరపురాని విజయాన్ని నమోదు చేసింది. రికీ పాంటింగ్ డబుల్ సెంచరీతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 556 పరుగుల భారీ స్కోరు సాధించింది. మళ్లీ రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్ ద్వయం కోల్‌కతా పోరాటాన్ని గుర్తుచేస్తూ 333 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ద్రవిడ్ (233), లక్ష్మణ్ (148) రాణించడంతో భారత్ 523 పరుగులు చేసింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో అజిత్ అగార్కర్ తన అద్భుతమైన బౌలింగ్‌తో చెలరేగాడు. కేవలం 41 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టడంతో ఆతిథ్య జట్టు 196 పరుగులకే ఆలౌటైంది. 230 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ తరపున ద్రవిడ్ మరోసారి నిలబడ్డాడు. ప్రశాంతంగా, అజేయంగా 72 పరుగులు చేసి చివరి రోజు భారత్‌ను 4 వికెట్ల తేడాతో గెలిపించాడు.

**4. బ్రిస్బేన్, 2021 – చారిత్రక గబ్బా గెలుపు**

గాయాలతో సతమతమవుతూ, కీలక ఆటగాళ్లు లేకుండా ఆస్ట్రేలియాలో సాధించిన గబ్బా విజయం భారత టెస్ట్ చరిత్రలో ఒక శిఖరం లాంటిది. విరాట్ కోహ్లీ, జస్‌ప్రీత్ బుమ్రా, రవిచంద్రన్ అశ్విన్, మహమ్మద్ షమీ, రవీంద్ర జడేజా, హనుమ విహారి, ఉమేష్ యాదవ్ వంటి కీలక ఆటగాళ్లు లేకుండా బరిలోకి దిగిన గాయపడిన జట్టు, పటిష్ఠమైన ఆస్ట్రేలియాను ఎదుర్కొంది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 369 పరుగులకు సమాధానంగా, శార్దూల్ ఠాకూర్, అరంగేట్ర ఆటగాడు వాషింగ్టన్ సుందర్ వీరోచిత పోరాటంతో భారత్ 336 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో మహమ్మద్ సిరాజ్ 5 వికెట్లతో చెలరేగడంతో ఆసీస్ 294 పరుగులకు ఆలౌటైంది. 32 ఏళ్లుగా గబ్బాలో ఓటమన్నదే ఎరుగని ఆస్ట్రేలియాపై భారత్ 328 పరుగుల కఠిన లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చింది. శుభ్‌మన్ గిల్ (91), రిషభ్ పంత్ (89నా), సుందర్ (22) అద్భుతమైన ఇన్నింగ్స్‌లతో ఆసీస్ బౌలింగ్ దాడిని ఎదుర్కొని చారిత్రక విజయాన్ని అందించారు. ఈ 3 వికెట్ల గెలుపునకు భారత టెస్ట్ చరిత్రలో ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుంది.

**5. లార్డ్స్, 2021 – కోహ్లీ నాయకత్వంలో దూకుడైన విజయం**

2021 లార్డ్స్ టెస్టులో ఇరు జట్ల మధ్య హోరాహోరీ పోరు నడిచింది. కేఎల్ రాహుల్ సెంచరీతో భారత్ 364 పరుగులు చేస్తే, జో రూట్ అద్భుత ఇన్నింగ్స్ (180)తో ఇంగ్లండ్ 391 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో మహమ్మద్ షమీ, జస్‌ప్రీత్ బుమ్రా లోయర్ ఆర్డర్ పోరాటంతో భారత్ 298/8 వద్ద డిక్లేర్ చేసింది. చివరి రోజు దాదాపు రెండు సెషన్ల ఆట మిగిలి ఉండటంతో మ్యాచ్ డ్రాగా ముగుస్తుందని అంతా భావించారు. కానీ కెప్టెన్ విరాట్ కోహ్లీ తన జట్టులో స్ఫూర్తి నింపుతూ, "ఈ 60 ఓవర్లలో వాళ్లకు నరకం చూపించాలి" అని పిలుపునిచ్చాడు. ఆ మాటలు జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. మహమ్మద్ సిరాజ్ (4), బుమ్రా (3), ఇషాంత్ శర్మ (2), షమీ (1) వికెట్లతో చెలరేగడంతో ఇంగ్లండ్ కేవలం 51.5 ఓవర్లలోనే కుప్పకూలింది. దీంతో భారత్ 151 పరుగుల తేడాతో చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది.భారత టెస్ట్ క్రికెట్ ప్రస్థానంలో ఇలాంటి ఎన్నో మరపురాని విజయాలు ఉన్నాయి. 600వ టెస్టు ఆడుతున్న ఈ తరుణంలో, ఈ చారిత్రక విజయాలు నేటి తరానికి స్ఫూర్తినిస్తూనే ఉంటాయి.



## నేటి నుంచి శ్రీలంకతో టెస్ట్ సిరీస్..

**కెప్టెన్ గిల్ కీలక వ్యాఖ్యలు**

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు చేరడమే తమ ప్రధాన లక్ష్యమని భారత టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు. శ్రీలంకతో రేపు శనివారం గాలేలో తొలి టెస్టు ప్రారంభం కానుంది. భారత్‌కు ఇది 600వ టెస్టు మ్యాచ్ కావడం విశేషం. గాలే వేదికగా జరిగే 50వ టెస్టు కూడా ఇదే.ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ ఐదో స్థానంలో ఉంది. వచ్చే తొమ్మిది టెస్టుల్లో దాదాపు ఆరు లేదా ఏడు మ్యాచ్‌లు గెలిస్తే ఫైనల్‌కు చేరే అవకాశాలు మెరుగవుతాయని గిల్ తెలిపాడు. వచ్చే ఏడాది జూన్‌లో లండన్‌లోని ఓవల్ మైదానంలో డబ్ల్యూటీసీ ఫైనల్ జరగనుంది.కాగా, శ్రీలంక పరిస్థితులకు అలవాటు పడేందుకు భారత జట్టు ముందుగానే అక్కడికి చేరుకుంది. కొలంబోలో శ్రీలంక క్రికెట్ ఎలెవన్ తో సన్నాహక మ్యాచ్ ఆడింది. ఈ అదనపు సమయం ఆటగాళ్లకు పరిస్థితులను అర్థం చేసుకునేందుకు ఉపయోగపడిందని గిల్ చెప్పాడు.బుమ్రా లేకపోయినా భారత ఫాస్ట్ బౌలింగ్‌పై గిల్ విశ్వాసం వ్యక్తం చేశాడు. ప్రసిద్ధ్ కృష్ణ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడని ప్రశంసించాడు. గుర్నూర్ బ్రార్ కూడా పాత బంతితో మంచి బౌన్స్ రాబట్టగలడని పేర్కొన్నాడు. శ్రీలంకలో పిచ్ ల నుంచి బౌలర్లకు పెద్దగా సహకారం లభించకపోవచ్చని.. అలాంటి పరిస్థితుల్లో విభిన్న వ్యూహాలతో ఒత్తిడి పెంచాల్సి ఉంటుందని చెప్పాడు.దేవదత్ పడిక్కల్‌పై కూడా గిల్ ప్రశంసలు కురిపించాడు. గతంలో ఇండియా-ఏ తరఫున శ్రీలంకలో ఆడిన అనుభవం అతడికి ఉపయోగపడుతుందని తెలిపాడు. గాలే లాంటి ఓపెన్ మైదానాల్లో గాలి దిశ బ్యాటింగ్‌పై ప్రభావం చూపుతుందని వివరించాడు.

# జాతీయోత్సాహంతో ముస్తాబైన మదనపల్లి

- 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం
- రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా జాతీయ పతాకావిష్కరణ
- శకటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, స్టాళ్లతో వైభవంగా వేడుకలు



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లిలో 80వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ శర్మ తెలిపారు. ఈ నెల 15వ తేదీ శనివారం ఉదయం బీటి కళాశాల పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ సమైక్యత, దేశభక్తి స్ఫూర్తి ప్రతిబింబించేలా ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేడుకలకు రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడల శాఖామాత్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉదయం 9.00 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. పరేడ్, పోలీసు గౌరవ వందనం, స్వాతంత్ర సమరయోధుల సన్మానం, ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ శాఖల స్టాళ్లు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. జిల్లా అధికారులు పరేడ్ గ్రౌండ్‌ను పండుగ వాతావరణంలో అలంకరించి, ప్రజలు సౌకర్యవంతంగా వేడుకలను వీక్షించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మహోత్సవంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, విద్యార్థులు, పాత్రికేయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ శర్మ పిలుపునిచ్చారు.



# డిసిసి ఉపాధ్యక్షుడిగా షేక్ అమీర్



**రాయచోటి–సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా, రాయచోటి పట్టణానికి చెందిన ముఖ్య కార్యకర్త అయిన తనను డిసిసి ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు షేక్ అమిర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షుడు పదవి బాధ్యతలను అప్పగించినందుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికి, రాష్ట్రానికి చేసిన అభివృద్ధి గురించి ప్రచారాన్ని ప్రజలలో తీసుకెళ్తూ, అన్ని నియోజక వర్గాలలో నా వంతు కృషి చేస్తానని చెప్పారు. నాకు ఈ పదవి రావడానికి సహకరించిన జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు, రాహుల్ గాంధీజీ, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ షర్మిల రెడ్డి, డిసిసి అధ్యక్షుడు గాజుల భాస్కర్ లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# 22వ తేదీన అనంతపురంలో పార్టీ ప్లీనరి సమావేశం

## - అన్ని పార్టీలకు కుంచం పిలుపు



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం:** కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, వేలూరు, కృష్ణగిరి, బళ్ళారి, రాయచూరు, చిత్రదుర్గ, కోలార్ తో కలిపి ప్రత్యేక రాయలసీమ ఏర్పాటు సాధనకై జరిగే పోరాటంలో భాగంగా అనంతపురం టౌన్ ఎన్జీవో ప్రాంగణంలో 22వ తేదిన జరుగు ప్లీనరీ సమావేశంలో అన్నీ పార్టీల నాయకులు తరలి రావాలని రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. మీడియా తో మాట్లాడుతూ మేధావులు, విద్యావంతులు పోరాటసూరులైన సీమ బిడ్డలు సీమ సాధనకోసం పిడికిలి బిగించాలని తరతరాల రాయలసీమకు జరిగిన, జరుగుతున్న అన్యాయాలను చాటేందుకు తరలిరావాలని కోరారు. ఈ ప్లీనరీ సమావేశాలలో సీమకు రావలసిన, కావాల్సిన అనేక విషయాలను చర్చించుకుందామన్నారు. పార్టీ సమావేశాలలో రాయలసీమ కోసం సీమ సింహాలను నిద్రలేపి ఒక ఉప్పెన రూపంగా ఉద్యమాన్ని ముందుకు నడుపుతూ సీమ ప్రజా ప్రతినిధులకు బుద్ధి చెప్పాల్సిన వేదిక ఈ సమావేశాలలో సీమ బిడ్డలమైన మనం అందరం పాల్గొని మన భావితరాల వారి జీవితాలను బంగారు మయం చేసుకోవడానికి, మన ప్రాంతాన్ని, మన సంస్కృతి సాంప్రదాయాలను రక్షించుకోవడానికి రావాలని సూచించారు. ఈ ప్లీనరీలో పార్లమెంట్ (లోక్ సభ, రాజ్యసభ) సమావేశాలు ఎప్పుడు జరిపినా అఖిలపక్ష సమావేశాలు ఎప్పుడు జరిపినా బిల్లు ప్రవేశపెట్టి రాయలసీమ కేంద్రపాలిత ప్రాంతంగా 2029 సంవత్సరము ముగిసే లోపల ఏర్పాటు చేయడమా లేక 1951వ సంవత్సరాలో అప్పటి మద్రాసు రాష్ట్రంలో ఉన్నటువంటి కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, వేలు ఊరు, కృష్ణగిరి, బళ్ళారి, రాయచనూరు, చిత్రదుర్గ మరియు కోలార్ తో కలిపి 12 జిల్లాలతో ప్రత్యేక రాయలసీమ ప్రాంతంగా ఆమోదించి తీర్మాణము చేసి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు. రాయలసీమ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కార్యాచరణ ప్రణాళిక గురించి చర్చించడం, పార్లమెంట్లో ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం కోసం ఆర్టికల్ 3 ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రజల గుండె చప్పుడు ప్రత్యేక రాయలసీమ, దీన్ని రాజ్యాంగబద్ధంగా ఎలా సాధించాలి పై చర్చించడం. సీమ సంస్కృతి సాంప్రదాయాలైన ఉత్సవాలను, జాతరలను ప్రభుత్వమే ఘనంగా జరిపించాలని పేర్కొన్నారు. అలాగే స్వాతంత్రోద్యమ నాయకుల వర్ధంతి, జయంతులను ప్రభుత్వమే నిర్వహించాలి వాటి స్మారకాలను ప్రభుత్వ అభివృద్ధిచేయడంపై చర్చించడం. సీమ దళిత బంధు, రైతుబంధు పేరుతో ఒక్కొక్క కుటుంబానికి 10 లక్షలు కేటాయించడంపై చర్చ జరుగుతోంది అన్నారు. తెలుగు విశ్వ విద్యాలయాన్ని సీమలో స్థాపించడం, రాయలసీమ విశ్వవిద్యాలయాలకు ప్రత్యేక నిధులు రాబట్టడంగురించి చర్చించడం. తిరుపతి తిరుమల దేవస్థానంలో రాయలసీమ యువతీ యువకులకే ఎక్కువ భాగం ఉద్యోగ అవకాశాలు కల్పించడం, దేవస్థాన నిధులను సీమకు కేటాయిండంపై చర్చ జరుగుతోంది అన్నారు. రైతులకు ప్రత్యేక ప్యాకేజిని ఏర్పాటు చేసి రైతు ధాన్యాన్ని నేరుగా రైతు అమ్ముకునే విధంగా ఏర్పాటు చేయడం పై చర్చ. రాయలసీమలోని అన్ని పరిశ్రమలలో సీమవాసులనే 80శాతం ఉద్యోగులుగా నియమించుకోవడం పై చర్చ ప్రస్తుతం రాయలసీమలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులన్నింటిని ఏ విధంగా త్వరతగిన పూర్తి చేయించుకోవాలి అనే అంశంపై చర్చ. రాయలసీమలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు పై చర్చ. రాయలసీమలోని ప్రతి జిల్లాకు ఒక సాఫ్ట్వేర్ కారిడార్లు ఏర్పాటు గురించి చర్చ. సి.పి.యస్. రద్దు చేయాలి. రాయలసీమకు లక్షల కోట్ల ప్యాకేజీ ఇవ్వాలి. గుంతకట్లు రైల్వేజోన్గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రాంతాలను పారిశ్రామిక కారిడార్గా ఏర్పాటు చేయాలి దీనివల్ల వెనుకబడిన రాయలసీమ నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలతో పాటు భూముల విలువలు కూడా పెరుగుతాయన్నారు.

# ట్రాఫిక్ సీఐ చాంద్ భాషకు ఘన సన్మానం



**రాయచోటి–సూర్య వాస్తవం:** రోడ్డు భద్రతా అవగాహన ట్రాఫిక్ సిఐ ఆధ్వర్యంలో బస్టాండ్ ఆటో కార్మికులకు, వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ సైన్‌లపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తు తమ విధులలో నిమగ్నమైన.. సీఐ చాంద్ భాషకు రాయచోటి పట్టణ జనసేన పార్టీ శ్రేణులు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్, దర్బార్ భాష, యహియా భాష,లు శుక్రవారం ట్రాఫిక్ స్టేషన్ లో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు ఘనంగా సన్మానించారు. పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ (మద్యం తాగి వాహనం నడపడం), హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించని వారిపై ప్రత్యేక తనిఖీలు చేపట్టి జరిమానాలు విధిస్తు మంచి మార్గాన్ని సూచిస్తున్న ట్రాఫిక్ సిఐ అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ శ్రేణులు అష్రఫ్ ,హబీబ్ లు పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగా - దేశభక్తి ఉత్సాహంతో ఘనంగా తిరంగా ర్యాలీ





**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం:** "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా రాయచోటి పట్టణంలో దేశభక్తి ఉత్సాహంతో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ గారి ఆధ్వర్యంలో రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.వి. చలపతి , ఎస్ఐలు ఎం. విష్ణువర్ధన్, అబ్దుల్ జహీర్ మరియు పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తిరంగా ర్యాలీని విజయవంతంగా నిర్వహించారు. ఈ తిరంగా ర్యాలీలో రాయచోటి పట్టణంలోని జూనియర్ కళాశాల విద్యార్థులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూని "భారత్ మాతాకీ జై", "వందే మాతరం" అంటూ దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొనడంతో రాయచోటి పట్టణం దేశభక్తి నినాదాలతో మార్మోగింది. ఈ ర్యాలీ రాయచోటి శివారు చెక్‌పోస్ట్ సమీపంలోని శివాలయం వద్ద ప్రారంభమై, బంగ్లా బస్టాండ్ సర్కిల్, అపోలో సర్కిల్, నవరంగ్ సర్కిల్, తానా సర్కిల్ మీదుగా బంగ్లా సర్కిల్ వరకు కొనసాగింది. ర్యాలీ మార్గమంతా జాతీయ జెండాలు రెపరెపలాడుతూ, విద్యార్థులు, పోలీసులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొనడంతో దేశభక్తి వాతావరణం నెలకొంది. తిరంగాను చేతబూని ముందుకు సాగిన ప్రతి అడుగు దేశం పట్ల గౌరవానికి ప్రతీకగా, ప్రతి నినాదం భారత మాత పట్ల భక్తికి నిదర్శనంగా నిలిచింది. అనంతరం బంగ్లా సర్కిల్ వద్ద ర్యాలీని మనోహరంగా ముగించి, జాతీయ గీతాన్ని ఆలపిస్తూ కార్యక్రమాన్ని ఘనంగా ముగించారు. ఈ సందర్భంగా జాతీయ ఐక్యత, సమైక్యత, దేశభక్తి భావాలను ప్రజల్లో మరింతగా పెంపొందించడమే "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.



# ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసిన సుగవాసి ప్రసాద్ బాబు

**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** విజయవాడలో గురువారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడుని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. ముఖ్యంగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలు, పార్టీ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి మరియు తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మరింత సమన్వయంతో పనిచేస్తామని సుగవాసి ప్రసాద్ బాబు గారు తెలిపారు.

# మత విద్వేష పాలకుడు మోడీ

## - కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ ధ్వజం



**కడప – సూర్య వాస్తవం :** ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రామ్ లీలా మైదాన ప్రాంగణాన్ని భారతీయ జనతా పార్టీ, ఆర్ఎస్ఎస్ నేతలు కలిసి శుద్ధి చేయడం అత్యంత దారుణమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విమర్శించారు. దళితులు, దళిత నాయకులు పట్ల ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా , రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మతవిద్వేషం చేస్తున్నారని విమర్శించారు. ఈ సంఘటన ద్వారా మత విద్వేష బీజం నాట్యం నాటేందుకు మోడీ అమిత్ షా కుట్ర పొందుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మల్లికార్జున కు పార్టీ జాతీయ అధ్యక్ష పదవి ఇచ్చి గౌరవించగా, అదే వ్యక్తిని దళితుడన్న కారణంగా ఇలాంటి అమానుషమైన చర్యకు పాల్పడటా న్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంద న్నారు. కరిగేను అవమానించడం వెనుక ప్రధాని నరేంద్ర మోడీ కుట్రపూరిత రాజకీయం దాగి ఉందన్నారు. ఇప్పటికే దేశ యువత, నిరుద్యోగులు ఎన్డీఏ ప్రభుత్వం, నియంత మోడీకి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తూ రాజీనామా చేయాల్సిందిగా డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త ఆందోళనలు చేస్తున్నారన్నారు. ఈ సంక్షోభ పరిస్థితుల్లో కూడా కుల వివక్ష, అంటరానితనం, అమానుషం వంటి వాటిపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ ధమనకాండ కు దిగడం శోచనీయమన్నారు. కేవలం తమ పట్ల దేశవ్యాప్తంగా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తారస్థాయిలో చేస్తున్న ఆందోళనలను దృష్టి మరల చెందుకే ప్రధాని నరేంద్ర మోడీ హోం మంత్రి అమిత్ షా ఈ ఘాతుకానికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. త్వరలో దేశ ప్రజలు కోరుకుంటున్న ప్రజాస్వామ్య ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో స్థాపిస్తుందని స్పష్టం చేశారు . కాంగ్రెస్ పార్టీ ఒక్కటే అన్ని వర్గాలు అన్ని కులాలు, మతాలను సమానంగా చూస్తుందని స్పష్టం చేశారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )

# గంజాయి అక్రమ రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

- రెండు వేర్వేరు కేసుల్లో 9 మంది అరెస్ట్
- 18 కిలోల గంజాయి స్వాధీనం
- మాదకద్రవ్యాల సరఫరా వ్యవస్థపై ప్రత్యేక నిఘా
- యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కఠిన చర్యలు
- గంజాయి సమాచారాన్ని పోలీసులకు అందించాలని ఎస్పీ విజ్ఞప్తి
- మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని పిలుపు





**తిరుపతి క్రైమ్ - సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు తిరుచానూరు, వెస్ట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన రెండు వేర్వేరు దాడుల్లో మొత్తం 9 మందిని అరెస్ట్ చేసి 18 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుంచి నాలుగు సెల్‌ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ యాక్ట్--1985 కింద కేసులు నమోదు చేశారు.

**తిరుచానూరులో ఐదుగురి అరెస్ట్**

తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పద్మావతిపురం స్మశానం వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.దర్యాప్తులో ప్రధాన నిందితుడు అరుగొండం సోమశేఖర్ శ్రీకాళహస్తి ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చి తిరుపతి, రేణిగుంట పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. ఈ కేసులో అరుగొండం సోమశేఖర్, అక్కల రథసారధి, షేక్ ఫైరోజ్ అలియాస్ ఫైరు, పన్నూరు లీలాక్రిష్ణ, గురివింటి చరణ్ తేజలను పోలీసులు అరెస్ట్ చేశారు.

**వెస్ట్ పోలీసుల దాడిలో 13 కిలోలు స్వాధీనం**

వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక నిఘాలో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటలకు మెటర్నిటీ హాస్పిటల్ రోడ్డు, రాజన్న పార్కు వెనుక ప్రాంతంలో పోలీసులు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 13 కిలోల డ్రై గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో కొండామర్రి జగదీష్, గొడ్ల పార్థసారథి అలియాస్ పార్థు, షేక్ ఇర్ఫాన్, బడి పోలయ్యలను అరెస్ట్ చేశారు. నిందితుడు బడి పోలయ్య విశాఖపట్నం ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చి తిరుపతిలో విక్రయించేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.ఈ రెండు కేసుల వివరాలను తిరుపతి ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీలు శ్రీనివాసులు (పరిపాలన), కె. రవి మనోహరాచారి (శాంతిభద్రతలు) వెల్లడించారు.

**మాదకద్రవ్యాలపై కఠిన చర్యలు**

తిరుపతి జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై పోలీసుల కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు స్పష్టం చేశారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా నిరంతర నిఘా కొనసాగిస్తూ, సరఫరా వ్యవస్థపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని ప్రజలను ఎస్పీ కోరారు.

# రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి...

**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శికి వినతి పత్రం సమర్పించిన రజక నేతలు -**

**మద్దతు ప్రకటించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య**



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** రాష్ట్రంలోని రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని అందుకు మద్దతు ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్యను రజక సంఘాల నేతలు కలసి వినతి పత్రం సమర్పించారు.శుక్రవారం తిరుపతిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్యను రాష్ట్ర ఎస్సీ సాధన కమిటీ కన్వీనర్ అక్కినపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో కోర్ కమిటీ నేత షణ్ముగం పర్యవేక్షణలో రజక సంఘాల నాయకులు కలసి వినతిపత్రం సమర్పించి రాష్ట్రంలో తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా రజకులను షెడ్యూల్ కులాల జాబితాలో చేర్చాలని తాము చేస్తున్న కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి పార్టీ పరంగా లేఖను రాయాలని కోరినట్లు పేర్కొన్నారు.సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య సానుకూలంగా స్పందించి అట్టడుగు వర్గాలలో అత్యంత వెనుకబడిన సామాజిక వర్గంగా అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్న రజక కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చేందుకు తాము మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.అనంతరం షణ్ముగం,అక్కినపల్లి లక్ష్మయ్య లు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాలలో మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో ఉన్న విధంగా రాష్ట్రంలో కూడా రజకులను ఎస్సి కులాల జాబితాలో చేర్పించడానికి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి తక్షణమే కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సిఫారసు చేయాలని వేరొక ప్రభుత్వానికి సిపిఐ పార్టీ రాష్ట్ర కమిటీ తరపున కూడా లేఖ ఇవ్వనున్నారని తెలిపారు.1985లో స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాల్సిన అవసరం ఉందని గుర్తించి క్యాబినెట్లో తీర్మానం చేసి కేంద్రానికి పంపడం జరిగింద న్నారు. 2024లో చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తప్పనిసరిగా రజకుల చిరకాల ఆకాంక్ష అయిన ఎస్సీ కులాల జాబితాలో చేర్చే అంశాన్ని నెరవేరుస్తానని చెప్పినట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలోని రజక సంఘాల నేతలు పలుమార్లు ముఖ్య మంత్రిని కలసి ఎస్సీ జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. కానీ ఇంతవరకు కూటమి ప్రభుత్వం పట్టించు కోలేదన్నారు. ఇప్పటికే ఏపీ రజక ఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఏలూరు, దాచేపల్లి, చిత్తూరు,అనకాపల్లి, రాజమండ్రి,మదనపల్లి లలో రజకులతోసభలు,రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.వినతి పత్రం సమర్పించిన వారిలో కోర్ కమిటీ సభ్యులు మల్లెల నాగరాజు రాష్ట్ర రజక ఉద్యోగ సంఘం అధ్యక్షులు గంధం బాబు,మనోహర్,సురేంద్ర, నారాయణ, అనురాధ, శేఖర్, రవి రజక సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

# హల్ద్వానీ ర్యాలీ వేదిక శుద్ధీకరణను తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్

- ఖర్గే గారి సభా వేదికను గంగాజలంతో కడిగారు
- ఇది కులవివక్ష : బాలగురవం బాబు

**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** ఆగస్టు 8వ తేదీన ఉత్తరాఖండ్ లోని హల్ద్వానీ రాంలీలా గ్రౌండ్‌లో జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభలో పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ మల్లికార్జున్ ఖర్గే గారు మాట్లాడిన వేదికను,ఆగస్టు 13న సభ ముగిసిన తర్వాత బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్య కర్తలు గంగాజలంతో శుద్ధి చేసి కుల వివక్షత చూపారని కాంగ్రెస్ తిరుపతి జిల్లా అధ్యక్షులు బాలగురవం బాబు తీవ్రంగా ఖండించారు గురువారం సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆర్ అండ్ బి బంగ్లా నుండి బస్టాండ్ ఆవరణలోని గాంధీ విగ్రహం మరియు అంబేద్కర్ విగ్రహానికి ర్యాలీగా వెళ్లి పూలమాలలు వేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా బాల గురవం బాబు మాట్లాడుతూ, అణగారిన వర్గాల కోసం డా.బి.ఆర్.అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచిస్తే, ఆ రాజ్యాంగాన్నే బిజెపి ప్రభుత్వం తుంగలో తొక్కి కుల వివక్షత చూపిస్తోందని మండిపడ్డారు.ఉమ్మడి కూటమి ప్రభుత్వంలో ఉన్న నాయకులకు దళితుల ఓట్లు మాత్రమే కావాలని,దళితులకు అన్యాయం జరిగితే



మాత్రం ప్రశ్నించడం లేదని ఆరోపించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భారతదేశంలో కుల వివక్షత జరుగుతుంటే మోడీ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గాని,తిరుపతి జిల్లాలో గాని ఎక్కడైనా దళితులపై కుల వివక్షత జరిగితే ఒప్పుకునే ప్రసక్తే లేదని,ఎంతవరకైనా పోరాడతామని బాలగురవం బాబు స్పష్టం చేశారుఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జ్ తపాల దామోదర్ రెడ్డి తిరుపతి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కన్నంబాకం హరికృష్ణ, జిల్లా జనరల్ సెక్రెటరీ గండవరం రమేష్ రెడ్డి,జిల్లా వైస్ ప్రెసిడెంట్ కరీముల్లా,జిల్లా వైస్ ప్రెసిడెంట్ దేవదానం,జిల్లా రైతు విభాగం అధ్యక్షులు జోగి వినోద్,జిల్లా కార్యదర్శి గోపి జిల్లా కార్యదర్శి ఇళయరాజా,సూళ్లూరుపేట సూళ్లూరుపేట నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆవల రమణ,దొరవరసత్రం మండలం మహిళా అధ్యక్షురాలు చాముండేశ్వరి, సూళ్లూరుపేట టౌన్ ప్రెసిడెంట్ సునీల్ రెడ్డి సూళ్లూరుపేట మండల ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ కోరిడి సుబ్రహ్మణ్యం సూళ్లూరుపేట టౌన్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ప్రవీణ్, శ్రీకాళహస్తి మండల ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి సూళ్లూరుపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితర శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**- ప్రభుత్వ పాఠశాలల్లో 9 పోస్టులకు తాత్కాలిక నియామకాలు**

**- ఆగస్టు 19లోగా మండల వనరుల కేంద్రంలో దరఖాస్తులు సమర్పించాలి**

**పెళ్లకూరు- సూర్య వాస్తవం:** 2026--27 విద్యా సంవత్సరానికి పెళ్లకూరు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం 9 పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొంది. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచించారు.

పాఠశాలల వారీగా ఖాళీల వివరాలు

పెళ్లకూరు మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు ఇలా ఉన్నాయి.

ఎంపీపీఎస్ జంగాలపల్లి -- ఎస్‌జీటీ (తెలుగు/ఇంగ్లీషు) -- 1 పోస్టు ఎంపీఎస్ మోదుగులపాలెం -- ఎస్‌జీటీ (తెలుగు/ఇంగ్లీషు) -- 2 పోస్టులు

ఎంపీఎస్ పుల్లూరు -- ఎస్‌జీటీ (తెలుగు/ఇంగ్లీషు) -- 1 పోస్టు

ఎంపీఎస్ రోసనూరు-- ఎస్‌జీటీ (తెలుగు/ఇంగ్లీషు) -- 1 పోస్టు

ఎంపీపీఎస్ ఎస్.ఆర్.పాలెం-- ఎస్‌జీటీ (తెలుగు/ఇంగ్లీషు) -- 1 పోస్టు

ఎంపీపీఎస్ ఎడపూడి -- ఎస్‌జీటీ (తెలుగు/ఇంగ్లీషు) -- 1 పోస్టు

జెడ్పీహెచ్ఎస్ తాల్వాయిపాడు -- ఎస్ఏ (బీఎస్) (తెలుగు/ఇంగ్లీషు) -- 1 పోస్టు

**75:25 నిష్పత్తిలో మెరిట్ ఆధారంగా ఎంపిక**

అభ్యర్థుల ఎంపికను వారి అకాడమిక్, ప్రొఫెషనల్ అర్హతల మార్కులను 75:25 నిష్పత్తిలో పరిగణనలోకి తీసుకుని మెరిట్ ప్రాతిపదికన చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఎంపిక ప్రక్రియలో అర్హతలు, మెరిట్‌కు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

**స్థానిక అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత**

పోస్టుల భర్తీలో సంబంధిత గ్రామం లేదా పెళ్లకూరు మండలానికి చెందిన అర్హత కలిగిన స్థానిక అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. స్థానికంగా అర్హత కలిగిన అభ్యర్థులు అందుబాటులో లేకపోతే ఇతర మండలాలకు చెందిన అర్హత కలిగిన అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటారు.

**ఆగస్టు 19 చివరి గడువు**

అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆగస్టు 19, 2026లోగా పెళ్లకూరు మండల వనరుల కేంద్రం (ఎంఆర్‌సీ)లో సమర్పించాలి. గడువు ముగిసిన తర్వాత అందే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని అధికారులు స్పష్టం చేశారు.

**జిల్లా స్థాయి కమిటీ ద్వారా తుది ఎంపిక**

అభ్యర్థుల తుది ఎంపికను జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీ చేపట్టనుంది. పాఠశాలల వారీగా, సబ్జెక్టుల వారీగా మెరిట్ ఆధారంగా తుది ఎంపిక జాబితాను కమిటీ రూపొందించనుంది.

**ఏప్రిల్ వరకు తాత్కాలిక సేవలు**

ఎంపికైన అభ్యర్థులు ఆగస్టు 29, 2026లోపు సంబంధిత పాఠశాలల్లో విధుల్లో చేరాల్సి ఉంటుంది. వారి సేవలు సెప్టెంబర్ 1, 2026 నుంచి ఏప్రిల్ 30, 2027 వరకు మాత్రమే కొనసాగుతాయి. అనంతరం మే 1, 2027 నాటికి ఈ తాత్కాలిక నియామకాలు స్వయంచాలకంగా ముగుస్తాయి.

**దరఖాస్తుతో జత చేయాల్సిన ధ్రువపత్రాలు**

అభ్యర్థులు దరఖాస్తుతో పాటు తమ విద్యా అర్హతలు, వృత్తి విద్యా అర్హతలు, టెట్ ఉత్తీర్ణత ధ్రువపత్రం, స్థానికత ధ్రువీకరణ పత్రాల ప్రతులను జత చేయాలి. సంబంధిత ధ్రువపత్రాలతో గడువులోగా స్థానిక మండల వనరుల కేంద్రం కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఎంఈఓ-1 పూడి కస్తూరయ్య, ఎంఈఓ-2 మించల శంకరయ్య సూచించారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని వారు కోరారు.

# చోరీకి పాల్పడిన ఇద్దరు మోటార్ సైకిల్ దొంగలు అరెస్టు






**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం** :అనంతపురం, ఉమ్మడి కడప జిల్లాలలో పలు మొటార్ సైకిల్స్ చోరిలకు పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు గాలివీడు మండలం, తుముకుంట కు వీరారెడ్డి, అంజనేయులు ను మీడియా ముందు హాజరు పరచిన పోలీసులు. నిందితుడు వీరారెడ్డి 31 కేసుల్లో ముద్దాయిగా వేళ్ళడించిన రాయచోటి డియస్పి కృష్ణమొహన్. నిందితుల నుంచి హీరోహోండా కంపేని కి చెందిన 7 మొటార్ సైకిల్స్ స్వాధీనం. చేసుకున్నట్లు మీడియా సమావేశాలు వివరించారు. డీఎస్పీ తోపాటు రాయచోటి అర్బన్ సీఐ వెంకట చలపతి ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలకు సిద్ధమైన శ్రీ సత్యసాయి జిల్లా

### - ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ




**శ్రీ సత్య సాయి బ్యూరో – సూర్య వాస్తవం :** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు శ్రీ సత్య సాయి జిల్లా ముస్తాబయింది ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఎస్పి సతీష్ కుమార్ శుక్రవారం పర్యవేక్షించారు. నేడు నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, అదనపు ఎస్పి అంకిత సురన ..లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పరేడ్ మైదానంలో చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేదిక, డెకరేషన్, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసేలా శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. శనివారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర బీసీ సంక్షేమ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రజలందరూ ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, జిల్లా ప్రజలు, విద్యార్థులు, స్వాతంత్ర్య సమరయోధులు పాల్గొననున్న ఈ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, డీఈఓ క్రిస్టప్ప , డీఆర్డీఏ పీడీ నరసయ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# టిడిపిలోకి 60 కుటుంబాలు చేరిక

### - న్యాయకత్వాకర్షణకు టిడిపిలోకి బారులు తీరిన వైఎస్ఆర్సిపి కార్యకర్తలు



**ప్యాపిలి –సూర్య వాస్తవం :** ప్యాపిలి మండలంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి మరో కీలక అడుగు పడింది. బురుగుల గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలు, రామకృష్ణాపురం గ్రామానికి చెందిన 10 కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, యువ నాయకులు కోట్ల రాఘవేంద్ర రెడ్డి నూతన సభ్యులకు పార్టీ కండువాలు కప్పి తెలుగుదేశం కుటుంబంలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న తెలుగుదేశం పార్టీ వైపు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీ పనిచేస్తోందని, రానున్న రోజుల్లో మరింత మంది టీడీపీలో చేరి పార్టీని బలోపేతం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. చేరిన కుటుంబాలు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే తెలిపారు.

# జోరుగా ఇసుక అక్రమ రవాణా దందా

### - చూసి చూడనట్లు సంబంధిత అధికారులు
### - పోలీసులు పట్టుబడుతున్న యదా విధిగా ఇసుక రాయచోటికి తరలింపు
### - భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయంటూ ప్రజల ఆవేదన



**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలంలోని పలుచోట్ల ఇసుక అక్రమ రవాణా దందా సాగుతుందని ఎలాంటి సందేహం లేదని చెప్పవచ్చు నప్పటికీ ఇసుకసురులు మాత్రం వారి పనితీరు మార్చుకోకపోవడంతో నిత్యం మండలం నుంచి తీసుకొని రాయచోటికి తరలించి 2500 నుంచి 3000 రూపాయలు వరకు వసూలు చేసుకుని జేబులు నింపుకోవడంతో మాండవ్య నదిలో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు జిల్లా కలెక్టర్ ఇసుకను అడ్డుకట్ట వేయాలని అక్రమంగా ఇసుకను తరలించే వారిపై కేసులు పెనాల్టీలు విధించాలంటూ పదేపదే చెప్తున్నప్పటికీ రాత్రి వేళల్లో ఇసుకను దొంగచాటుగా తీసుకొని రాయచోటి రామాపురం తదితర ప్రాంతాలకు చేరవేస్తూ జోగులు నింపుకుంటున్నారని పలు గ్రామాలను ప్రజలు ఆవేదన చెందుతున్నారు ఇలాగే ఉంటే మరి రెండు మూడు నెలల్లో తాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని పలువురు ఆవేదన చెందుతున్నారు ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ఇసుక అక్రమ రవాణా సాగకుండా అరికట్టాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని పరువులు కోరుతున్నారు

**ఇసుక ట్రాక్టర్లు పట్టివేత....**

మండలం నుంచి అక్రమంగా వెళుతున్న ఇసుక ట్రాక్టర్లను ఎస్ఐ మరియు పోలీస్ సిబ్బంది పట్టుకుంటూ అపరాధ రుసుము వేయడమే కాకుండా కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిసింది.

# డ్రగ్స్, గంజాయిని కూకటి వేళ్లతో పెకిలిద్దాం

- విద్యార్థుల ప్రతిజ్ఞ.. మాదకద్రవ్యాల నిర్మూలనకు ఐక్యంగా పోరాటం
- హిందూపురంలో 30 పాఠశాలలు, మదరసాల విద్యార్థులతో అవగాహన
- డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే యువతకు ఉజ్వల భవిష్యత్తు : అడిషనల్ ఎస్పీ కేవీ. మహేష్





**హిందూపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలను సమాజం నుంచి కూకటి వేళ్లతో పెకిలించాలని హిందూపురంలో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వేదికగా విద్యార్థుల ప్రసంగ పోటీలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ అధ్యక్షుడు, కవి, రచయిత, సామాజిక సేవకుడు కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అడిషనల్ ఎస్పీ కేవీ. మహేష్ అధ్యక్షత వహించారు. సుమారు 30 పాఠశాలలు, మదరసాలకు చెందిన విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో మన బాధ్యత"**

అనే అంశంపై విద్యార్థులు ప్రసంగించారు. మాదకద్రవ్యాల వల్ల యువతపై పడుతున్న దుష్ప్రభావాలు, విద్యార్థుల భవిష్యత్తుపై వాటి ప్రభావం, తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల బాధ్యత, మాదకద్రవ్యాల నివారణలో యువత పాత్ర తదితర అంశాలపై విద్యార్థులు చైతన్యవంతమైన సందేశాలు ఇచ్చారు. "డ్రగ్స్ వద్దు -- జీవితం ముద్దు. యువతను కాపాడుదాం -- దేశ భవిష్యత్తును నిర్మిద్దాం" అంటూ విద్యార్థులు నినదించారు. మాదకద్రవ్యాల నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న 30 మంది విద్యార్థులకు అడిషనల్ ఎస్పీ మహేష్, పోలీసు అధికారులు, ప్రముఖుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.

**"మాదకద్రవ్య రహిత యువతే --బలమైన భారతదేశానికి పునాది"**

అనే సందేశంతో విద్యార్థులు డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు కులమతాలకు అతీతంగా ఐక్యంగా, శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు ముతవల్లీ జానీ, మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, డా. అఫ్తాబ్, మెడికల్ సూపరింటెండెంట్ శేఖర్, అకాడమీ ప్రతినిధి శేఖర్, రూరల్ సీఐ అంజినేయులు, లైఫ్ వరల్డ్ ఉదయ్‌కుమార్, మౌలానా తంజీల్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోపాల్, ముస్తఫా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థుల ప్రతిజ్ఞ సారాంశం**

డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలను కూకటి వేళ్లతో పెకిలించి, యువతను మరియు దేశ భవిష్యత్తును కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. దేశ అభివృద్ధి, సుస్థిరత, జాతీయ సమైక్యత కోసం మాదకద్రవ్య రహిత, ఆరోగ్యవంతమైన భారతదేశ నిర్మాణానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞలో పేర్కొన్నారు.

# దళితుల ఆత్మగౌరవాన్ని అవమానిస్తే చూస్తూ ఊరుకోం

- బీజేపీకి దళితులంటే చులకనభావం?
- కులవివక్షకు వ్యతిరేకంగా, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుంది
- కులం, మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించే రాజకీయాలను ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలి
- డా. గార్లపాటి మద్దులేటి స్వామి, అడ్వకేట్‌డనంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



**డోన్– సూర్య వాస్తవం)**

రామ్ లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, దళిత మహానేత మల్లికార్జున ఖర్గే అడుగు పెట్టిన ప్రాంతాన్ని గంగాజలంతో శుద్ధి చేశారన్న ఘటన తీవ్రమైన చర్య అని, నంద్యాల జిల్లా అధ్యక్షులు డాక్టర్ గార్లపాటి మద్దులేటి స్వామి పత్రిక సమావేశం లో ఖండించారు. శుక్రవారం పార్టీ కార్యాల యంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన కార్యక్రమంలో దేశంలోని అగ్రశ్రేణి నాయకుడిగా, రాజ్యాంగ విలువలకు కట్టుబడి పనిచేస్తున్న శ్రీ మల్లికార్జున ఖర్గే పాల్గొన్న ప్రాంతాన్ని ఆయన ఉనికితో అపవిత్రమైందన్న భావనతో శుద్ధి చేయడం అత్యంత దురదృష్టకరమైన చర్య అని, ఒక వ్యక్తి కులం ఆధారంగా ఆయన అడుగుపెట్టిన ప్రదేశాన్ని శుద్ధి చేయడం అంటే అది కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదు; దేశ రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వ స్ఫూర్తిని, సామాజిక న్యాయాన్ని, మానవ గౌరవాన్ని అవమానించడమే. కులవివక్ష, అంటరానితనం, అసమానతలకు వ్యతిరే కంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పోరాడి సాధించిన రాజ్యాంగ హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిన సమయంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం సభ్య సమాజం సిగ్గుతో తలవంచుకునే పరిస్థితిని కల్పిస్తోంది. బీజేపీ మరియు దానికి అనుబంధంగా ఉన్న హిందుత్వ సంస్థలు ఈ చర్యకు పాల్పడి ఉంటే, వారు తమ వైఖరిని ప్రజల ముందు స్పష్టంగా వెల్లడించాలని వారు డిమాండ్ చేశారు. దళితుల పట్ల వివక్ష, కులవివక్ష, సామాజిక అసమానతలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ వ్యతిరేకమని, మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయులు కలలు కన్న సమానత్వ సమాజం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతూనే ఉంటుందని, మల్లికార్జున ఖర్గే దేశ రాజకీయాల్లో దళిత సమాజం నుంచి ఎదిగి అత్యున్నత స్థాయికి చేరుకున్న మహోన్నత నాయకుడని, ఆయనను అవమానించే ఏ చర్య అయినా దేశంలోని కోట్లాది దళితులు, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని అవమానించడమే అని, సమానత్వం, ఏకత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, కులం, మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించే రాజకీయాలను ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని, ఈ ఘటనపై బీజేపీ నాయకత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని, ఇలాంటి వివక్షాపూరిత చర్యలకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమములో డిసిసి ఉపాధ్యక్షులు న్యాయవాది ఉన్నిగొర్ల జనార్ధన్, డిసిసి ప్రధానకార్యదర్శి న్యాయవాది వడ్డే రాజశేఖర్, ప్యాపీలి మండల అధ్యక్షులు ఎస్. మహేంద్ర నాయుడు, నాయకులు అప్పన్న తదితరులు పాల్గొన్నారు

# తల్లికి వందనం బదులు 'అమ్మ ఒడి' ప్రచారం చేయడం సరికాదు

- అన్నమయ్య జిల్లా డీఈఓ సుబ్రహ్మణ్యంపై చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలి
- తుమ్మల లవ కుమార్ ఏఐఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు




**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్న తరుణంలో, అన్నమయ్య జిల్లా డీఈఓ సుబ్రహ్మణ్యం మాత్రం గత ప్రభుత్వ హయాంలో అమలైన 'అమ్మ ఒడి' పథకాన్ని ప్రచారం చేయడం దారుణమని ఆల్ ఇండియా స్టూడెంట్స్ పవర్ ([illegible]) రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల లవకుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఒక కుటుంబంలో ఎంతమంది అర్హత కలిగిన విద్యార్థులు ఉన్నా వారికి 'తల్లికి వందనం' పథకం ద్వారా ప్రయోజనం కల్పించే విధంగా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమలైన 'అమ్మ ఒడి' పథకంతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల ప్రయోజనాలను మరింత విస్తృతంగా పరిగణనలోకి తీసుకుంటోందన్నారు. అలాంటి సమయంలో ప్రభుత్వ విద్యాశాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి ప్రభుత్వ ప్రస్తుత సంక్షేమ పథకాన్ని విద్యార్థులు, తల్లిదండ్రుల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు. అయితే అందుకు విరుద్ధంగా గత ప్రభుత్వ పథకమైన 'అమ్మ ఒడి' పేరును ప్రచారం చేయడం అధికారిక కార్యక్రమాల్లో గందరగోళానికి దారితీసే అంశమని విమర్శించారు. ఒక జిల్లా విద్యాశాఖ అధికారి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా, సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించకపోతే, ప్రభుత్వం తీసుకుంటున్న మంచి నిర్ణయాలు క్షేత్రస్థాయిలో విద్యార్థులకు ఎలా చేరుతాయని ప్రశ్నించారు. అన్నమయ్య జిల్లాలో డీఈఓ సుబ్రహ్మణ్యంపై ఇప్పటికే పలు ఆరోపణలు, విమర్శలు వస్తున్న నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ అంశంపై దృష్టి సారించి, సమగ్ర విచారణ నిర్వహించాలని [illegible] తరపున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. విచారణలో ఆరోపణలు నిజమని తేలితే డీఈఓ సుబ్రహ్మణ్యంపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుని, అవసరమైతే విధుల నుంచి తొలగించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ పవర్ ([illegible]) డిమాండ్ చేస్తుందని తుమ్మల లవకుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జిల్లా నాయకులు గణేష్, అశోక్, దినేష్ తదితరులు పాల్గొన్నారు

# అవార్డుల ఎంపికలో గోల్ మాల్

- అనంత జిల్లాలో అవార్డుల ఎంపికలో అక్రమాలు....?
- 52 శాఖలకు కలిపి 288 అవార్డులు
- రెవెన్యూ, పోలీస్ శాఖలకే అగ్రస్థానం
- ఒకే శాఖలో భార్యాభర్తల ఎంపిక
- కీలక శాఖ నుంచి ప్రతిపాదనలు పంపకున్నా.. అవార్డుకు ఎంపిక
- పని దొంగలు, అవినీతి, అక్రమార్కులకు పెద్దపీట
- కలెక్టరేట్ లో చక్రం తిప్పిన రెవెన్యూ ఉద్యోగులు

**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** విధి నిర్వహణలో నీతి, నిజాయతీ, నిబద్ధత, అంకిత భావంతో సేవలందించే ఉద్యోగులకు వారి సేవలకు గుర్తింపుగా స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయిలో అవార్డులకు ఎంపిక చేసి, ఆయా వేదికలపై అవార్డులు అందించడం ఆనవాయితీ. సంప్రదాయం. అయితే ఈసారి అనంతపురం జిల్లాలో అవార్డుల ఎంపిక జాబితా పరిశీలిస్తే పని దొంగలకు, అక్రమార్కులకు, అవినీతిపరులకు పెద్దపీట వేయడం దుమారం రేగుతోంది. శనివారం జరగనున్న స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా శుక్రవారం రాత్రి కలెక్టరేట్ నుంచి అవార్డుల జాబితా విడుదలైంది. వాటిని పరిశీలించిన వారికి దిమ్మతిరిగింది. ఆయా శాఖల అధిపతులు సిఫార్సు చేయని వారి పేర్లు కూడా జాబితాలో ఎలా వచ్చాయో అంతుబట్టక అయోమయంలో పడిపోయారు. మరో కీలక శాఖలో భార్యభర్తులు పనిచేస్తుండగా ఇద్దరినీ ఏ విధంగా ఎంపిక చేశారో తెలియడం లేదు. ఎంతో మంది నిజాయితీగా సేవలదించిన ఉద్యోగులు ఉండగా.. ఒకే ఇంట్లో ఇద్దరిని ఎంపిక చేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

### రెవెన్యూ, పోలీస్ శాఖలకు పెద్దపీట

మొత్తం 52 శాఖలకు గాను 288 మందిని అవార్డులకు ఎంపిక చేశారు. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 45 అవార్డులు రెవెన్యూ వారికే ఎంపిక చేయగా, పోలీస్ శాఖకు ఏకంగా 70 అవార్డులు సిద్ధం చేశారు. మరో ఆరేడు శాఖలకు ఏడు, లేదా ఎనిమిది అవార్డులు కేటాయించగా, మిగిలిన శాఖలకు మొక్కుబడిగా రెండు లేదా మూడు అవార్డులు మాత్రమే కేటాయించారు. ఆయా శాఖల నుంచి పంపిన జాబితాలోని సీరియల్ గా కూడా తీసుకోకుండా ఇష్టమొచ్చిన పేర్లు తీసుకొని అవార్డులకు ఎంపిక చేయడంపై అన్ని శాఖల ఉద్యోగులు రగిలిపోతున్నారు. ఇదంతా కలెక్టర్ కు తెలియకుండా కలెక్టరేట్ లోని కొందరు ఉద్యోగులు అక్రమాలకు పాల్పడి.. ఇలా గందరగోళం చేసిపెట్టారని పలు శాఖల ఉద్యోగులు మండిపడుతున్నారు.

# స్వాతంత్ర్య వేడుకల పేరుతో నిషేధిత ప్లాస్టిక్ హంగామా...!

- అనంతలో నిషేధిత ప్లాస్టిక్ జెండాలు, థర్మోకోల్‌తో భారీగా ఏర్పాట్లు
- థర్మోకోల్ వినియోగంపై నిబంధనలు ఉన్నా పట్టించుకోని నిర్వాహకులు..!
- నిబంధనలు కాగితాలకే పరిమితమా?
- ఏఎంసీ పిసిబి, అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు...





**అనంతపురం సిటీ - సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి. అయితే వేడుకల ఏర్పాట్లలో నిషేధిత ప్లాస్టిక్ జెండాలు, థర్మోకోల్ వంటి పర్యావరణానికి హానికరమైన పదార్థాల వినియోగం కనిపిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ జెండాను గౌరవప్రదంగా వినియోగించాల్సిన సమయంలో ప్లాస్టిక్ జెండాలు, థర్మోకోల్ అలంకరణలకు ప్రాధాన్యం ఇవ్వడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి నిబంధనలు ఉన్నప్పటికీ వాటి అమలుపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. నగరంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి నిషేధిత ప్లాస్టిక్, పర్యావరణానికి హాని కలిగించే పదార్థాల వినియోగాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా ఏఎంసి , పిసిబి అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పర్యావరణహితంగా, జాతీయ జెండా గౌరవానికి భంగం కలగకుండా నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

# న్యాయం కోసం న్యాయవాదుల ఆందోళన

- కోర్టు రోడ్డుపై బైఠాయించి న్యాయవాదుల నిరసన
- సీఐపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్
- డీఎస్పీ చంద్రశేఖర్‌కు బార్ అసోసియేషన్ ఫిర్యాదు
- ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు తేలుస్తామన్న డీఎస్పీ
- చర్యలు తీసుకునే వరకు ఆందోళన కొనసాగిస్తామన్న న్యాయవాదులు
- న్యాయవాదుల భద్రతకు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్




**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం:** జూనియర్ న్యాయవాదిపై అనంతపురం రూరల్ సీఐ శ్రీకాంత్ దురుసుగా ప్రవర్తించి దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ న్యాయవాదులు శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. కోర్టు రోడ్డు వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సీఐపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. గురువారం ద్విచక్ర వాహనాల తనిఖీల సందర్భంగా జూనియర్ న్యాయవాది గౌతమ్ రాజుకు, అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీకాంత్‌కు మధ్య వాగ్వాదం జరిగినట్లు న్యాయవాదులు తెలిపారు. అనంతరం గౌతమ్ రాజును పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి దాడి చేశారని వారు ఆరోపించారు. ఈ ఘటనలో న్యాయవాదికి గాయాల య్యాయని, శరీరంపై గీతలు, రక్తగాయాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు.



ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ న్యాయవాదులు పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. ఘటనపై బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎస్పీ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలు వెలుగులోకి వచ్చిన అనంతరం చట్ట ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇచ్చినట్లు న్యాయవాదులు తెలిపారు. అయితే సీఐపై తక్షణ చర్యలు తీసుకునే వరకు ఆందోళన విరమించేది లేదని న్యాయ వాదులు స్పష్టం చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలని, ఆరోపణలు నిజమని నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల ఆందోళనతో ప్రధాన రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. న్యాయవాదుల భద్రతకు ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆందోళనకారులు కోరారు.

# ఘనంగా రామిరెడ్డి ధ్వజారెడ్డి జన్మదిన వేడుకలు

**తిరుపతి - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా చిట్వేలు మండలం రామిరెడ్డి ధ్వజారెడ్డి జన్మదిన వేడుకలు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషుల సమక్షంలో అంగరంగ వైభవంగా, ఘనంగా నిర్వహించ బడ్డాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రామి రెడ్డి, ధ్వజారెడ్డి గారికి హృదయపూర్వక జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. నాయకులు వారికి పుష్ప గుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించి, కేక్ కట్ చేయించి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న రామిరెడ్డి, ధ్వజారెడ్డి గారికి భగవంతుడు ఆయురా రోగ్యాలు, సుఖసంతోషాలు, మరిన్ని విజయాలు ప్రసాదించాలని నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు తమ నాయకులపై ఉన్న అభిమానాన్ని చాటుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ జన్మదిన వేడుకలను మరింత ఉత్సాహభరితంగా మార్చారు. నాయకుల ఆశీస్సులు, కార్యకర్తల అండదండలతో భవిష్యత్తులో మరింత ప్రజాసేవ చేయాలని ఆకాంక్షిస్తూ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

**రామిరెడ్డి, ధ్వజారెడ్డికి హృదయపూర్వక జన్మదిన శు భాకాంక్షలు.**

మీ నాయకత్వంలో ప్రజాసేవ మరింత విజయవంతంగా కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. చిట్వేలు మండలం వైఎస్ఆర్సిపి నాయకులు ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం ఒక సైనికుడి లాగా కష్టపడుతూ నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా రూపొందింప చేయడానికి ఆయన కృషి చేస్తున్నాడని



అలాంటి నాయకుడు పార్టీకి ఎంతో అవసరమని ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ఆపదలో ఉన్న వారికి ఎంతో సహాయం చేసిన గొప్ప మనిషి ధ్వజ రెడ్డి అన్నా అని కొనియాడారు

# న్యాయవాదులకు రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి...?

- పోలీసుల తీరుపై న్యాయవాది సాయికుమార్ తీవ్ర ఆగ్రహం
- ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అవసరం
- న్యాయవాదుల భద్రతకు ప్రభుత్వం బాధ్యత వహించాలి
- ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి
- లాయర్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే అమలు చేయాలని న్యాయవాది సాయికుమార్ డిమాండ్ చేశారు



**ఆదోని క్రైమ్ - సూర్య వాస్తవం :** వాహనాల తనిఖీ విషయంలో అనంతపురం రూరల్ సీఐ శ్రీకాంత్, న్యాయవాది గౌతమ్ రాజ్ మధ్య మాటామాటా పెరిగి, సీఐ న్యాయవాదిపై చేయి చేసుకున్నారని, ఈ ఘటనలో గాయాల య్యాయని న్యాయవాది సాయికుమార్ ఆరోపించారు. న్యాయవాదిపై జరిగినట్లు చెబుతున్న ఈ ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులే న్యాయవాదిపై దాడికి పాల్పడుతున్నారనే ఆరోపణలు రావడం ఆందోళన కలిగించే విషయమని సాయికుమార్ అన్నారు. న్యాయవాదులకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు అని ఆయన పేర్కొన్నారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. గత కొన్ని సంవత్సరాలుగా న్యాయ వాదులు, న్యాయవాద సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు శాంతియుతంగా నిరసనలు నిర్వహించి, వినతిపత్రాలు సమర్పిస్తున్నప్పటికీ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. భవిష్యత్తులో న్యాయవాదులపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సాయికుమార్ కోరారు. న్యాయవ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న న్యాయవాదుల భద్రతకు ప్రభుత్వం తగిన రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. న్యాయవాదుల రక్షణ కోసం లిలాయర్స్ ప్రొటెక్షన్ యాక్ట్"ను వెంటనే తీసుకువచ్చి, ఎలాంటి జాప్యం లేకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు

# బ్ర.మఠం బిసి చైతన్య సమితి కమిటీ ఏర్పాటు

- సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన జాతీయ అధ్యక్షులు బిసి రమణ



**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం :** కడప జిల్లా బ్రహ్మంగారిమఠం జాతీయ బీసీ చైతన్య సమితి జాతీయ వ్యవస్థాపకుడు బిసి రమణ ఆధ్వర్యంలో మండల కమిటీ నియామక పత్రాలను సభ్యులకు అందజేయడం జరిగినది. బ్రహ్మంగారిమఠం మండల గౌరవ అధ్యక్షులుగా గోడ్లవీటి సుబ్రహ్మణ్యం ఆచారి, గౌరవ సలహాదారులుగా మలినేని రామయ్య,రాష్ట్ర కార్యదర్శిగా రాళ్లపాటి చిన్న మస్తాన్,మండల అధ్యక్షుడిగా మల్లె బాలకృష్ణను నియమించి నియామక పత్రాన్ని వ్యవస్థాపకుడు బీసీ రమణ జాతీయ సలహాదారుడు తమ్మిశెట్టి సుబ్బరాయుడు చేతులమీదుగా అందిం చడం జరిగినది. ఉపాధ్యక్షులుగా బంగారు జయ వీర వర్ధన్, కలగొట్ల శ్రీనివాసులు,సిద్దయ్య, ఎర్ర నాగు ఓబయ్య, ప్రధాన కార్యదర్శిగా గురవయ్యను,కొశాధికారీగా రెడ్ల దిన్నె నాగ ఖాదరయ్య ,ఆర్గనైజేషన్ సెక్రెటరీ సన్నపురి శ్రీను, అధికార ప్రతినిధి ఇటుకల ప్రసాద్, పెరుగు సుధాకర్, సహాయ కార్యదర్శి నాగిడి విజయ భాస్కర్,బోగా వీరయ్య , కార్యవర్గ సభ్యులు ను నియమించి నియామక పత్రాన్ని అందించడం జరిగినది. కమిటీ సభ్యులందరికీ జిల్లా కమిటీ సభ్యులు మండల కమిటీ నియామక పత్రం అందించారు. అనంతరం మండల కమిటీ సభ్యులు అందరి చేత ప్రమాణ స్వీకారం చేపించడం జరిగినది. కమిటీ సభ్యులందరూ జాతీయ బీసీ చైతన్య సమితి అభివృద్ధి కొరకు తమ వంతు బాధ్యతాయుతంగా కలసి పనిచేసి కలిసికట్టుగా ఉండాలని బీసీ రమణ సభ్యులందరినీ కోరారు.

